సుప్రభాతం

స్య తనయ, శ్రీరామ, కౌస్తుభాంగా తూర్పున భానుడుదయించె తోయజాక్ష, దేవసంబంధ కార్యాలను దీర్చుకోగ వేడుకొందుము, మేలుకో శ్రీ వేంకటేశా.’

ఎంతటి మధుర రచన! కవిజన్మ తరించిపోయింది !

‘లేవయ్య శ్రీహరి, గోవిందలెమ్మునిదురా, కళ్యాణ మొనరించ వేగముగ కమల నయనా, ప్రొద్దెక్కనున్న దటు చూడ భుజగశయన, వేగ లేవయ్య మము బ్రోవ వేంకటేశా!’

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం చెవుల సోకుతూనే మెలకువ వచ్చింది కమలాకరరావుకు. ‘అప్పుడే కుముదినీ దేవి లేచినట్లుంది!’ అనుకొంటూ అలాగే కళ్ళు తెరవకుండా బద్ధకంగా పడుకున్నాడు.

“మధుకైటభారి శ్రీహరి ప్రక్కనుండి ఎల్లలోకముల గన్నమాతల్లి లక్ష్మి, ఆశ్రిత మానవుల సదా ఆదరించ అలివేలు మంగమ్మ యికమేలుకోమ్మా.”

నాగస్వరానికి మైమరచి వింటున్న నాగుబాములాగా పడుకున్న కమలాకరం యేమో జ్ఞాపకంరాగా ఒక్కసారి త్రుళ్ళిపడి లేచాడు. చిరునవ్వుతోనే గబగబా బయటకు నడిచాడు.

"బ్రహ్మాది దేవతలందరు భక్తిమీర సురగురూ త్త
మునివెంట తరలి నేడూ, నా దివ్యరూపంబుగానగనిలిచినారు;
శ్రీఘ్రముగ, లేవయ్యా శ్రీ శ్రీనివాసా......"

పూజామందిరంలో యిరువైపుల శ్రీ లక్ష్మి పద్మా
వతులతో శ్రీనివాసుడు ఆవునేతి దీపాలమధ్య దేదీప్య
మానంగా ప్రకాశిస్తున్నాడు. చంపక పారిజాతాలతో ఆ భగ
వద్విగ్రహాల పాదపూజ చేస్తూ కుముదిని తదేకధ్యానంతో
పరవశమై పాడుతూన్నది మేలుకొలుపు.

'కమలాలు వికసించు కాలమాయె. నానా సుగంధ
కుసుమాలు నవ్వెనవిగో. పక్షులగుంపుల తీయనిపాట వినగ
వేగలేవయ్యా నిదుర శ్రీవేంకటేశా !'

గానం ముగించుతూనే కుముదిని నీరాజనం వెలిగించి,
జేగంట వాయించింది. భక్తిశ్రద్ధలతో పూజాకుంకుమ నొసట
ధరించి, దైవపాదాలపై పవిత్రతనందిన రెండు పుష్పాలుతీసి
వేణిలో తురుముకుంది. అవనత నేత్రియై నమస్కరించి, అక్షు
తలు చేతబట్టి ప్రదక్షిణా చెయ్యడానికుపక్రమించింది. ప్రథమ
ప్రదక్షిణం చేస్తూనే వులిక్కిపడి యేదో అపరాధం చేసినట్లు
రెండడుగులు వెనక్కువేసి ప్రూన్పడిపోయింది కుముదిని.

నేలచూపులు చూస్తూ నిల్చున్న ఆమెను అలా రెప్ప
వాల్చకుండా రెండునిముషాలు చూచాడు కమలాకరం. బిగ్గ
ఱగా నవ్వుతూ చప్పట్లుచరిచి, "హేట్సాఫ్ కుముదం. చాలా
బాగుందిగానం." అంటూ వచ్చినంతవేగంగానూ వెనుదిరిగి
వెళ్ళిపోయాడు. భయసంకోచాలతో నేత్రాలను విపరీతంగా

కదిలించడం తప్ప నోరువిప్పి మాట్లాడలేకపోయింది కుముదిని. అడుగులు ముందుకు కదల్చలేకపోయింది. అలా స్థాణువై ఎంత సేపు నిల్చుందో తనకే తెలియలేదు.

"పూజ అయిందమ్మా?" వెంకటచలం దొడ్లోంచి లోపలికివస్తూ గడపఅవతలనిల్చున్నాడు. గాలి పటమై ఎగురుతూన్న కుముదినీ దేవిమనస్సు మామగారి ప్రశ్నకు త్వరగా దిగివచ్చి శరీరంలో లీనమైంది. "అయ్యిందండి." మెల్లగా సమాధానమిచ్చి, హారతి పళ్ళెరం ఎత్తి ఆయన కభిముఖంగా పట్టుకుంది. వెంకటచలం భక్తిగా కర్పూర హారతి కళ్ళకద్దుకున్నాడు. కుముదిని ఇచ్చిన ప్రసాదం ఆప్యాయంగా అందుకుంటూ "ముఖమలా చిన్నబోయిందేమమ్మా? వాడేమన్నా అన్నాడేమిటి?" అన్నాడు కోడలిముఖం పరిశీలనగా చూస్తూ.

"లేదండి" ప్రయత్నపూర్వకంగా పెదవులపైకి చిరునవ్వొకొని తెచ్చుకుంది.

"హూఁ!" నిట్టూర్చాడు వెంకటచలం. "అంటే మాత్రం నువ్వు చెప్తావా? అయినా వాడుకదేం పాడుగుణమో!" అనుకొంటూ మెల్లగా వెళ్ళిపోయాడు.

కుముదిని వెళ్ళేసరికి గదిలో కాలుగాలిన పిల్లిలాగా పచార్లు చేస్తున్నాడు కమలాకరం. తెచ్చిన కాఫీ ఫలహారాలు బల్లమీద వుంచుతూ 'తీసుకోండి' అంది మెల్లగా. పచారు ఆపుజేసి తీక్ష్ణంగా చూచాడు కమలాకరం. కుముదిని తల వాల్చింది. అలా కొన్ని క్షణాలు బరువుగా దొర్లిపోయాయి.

"కాఫీ చల్లారిపోతోంది." అంది కడకు కుముదిని మెల్లగా.

"కాఫీ చల్లారిపోతోంది!" హేళనగా నిర్లక్ష్యంగా రెట్టించాడు. "నా ఉత్సాహమే చల్లారిపోతోంది నిన్ను చూచినకొలదీ!"

కుముదిని మాట్లాడకుండా టేబుల్ క్లాత్, పేపర్ వెయిట్‌లూ సర్దసాగింది.

"అయితే నా కయిష్టమైన పనులు చేయడమే నీ కిష్టమా?" తీక్షణంగా ప్రశ్నించాడు. "అమ్మవారిలాగా ఆ పట్టుచీర కేమిటి? ముసలమ్మలాగా ఆ పూజలెందుకు? ఇవ్వాళ అటోయిటో తేల్చేయదల్చుకున్నాను." బలంకొలదీ ఎదుటి టీపాయ్‌ని కాలితో తన్నాడు. అది నాలుగు దొర్లులు దొర్లి, కప్పూ, సాసరూ తునాతునాకలై పోయాయి. కాఫీ ఫలహారాలు నేలపరమయ్యాయి.

"మీరు నిద్రలేవకముందే నా కార్యక్రమం పూర్తి చేసుకుంటున్నాను కదా? అయినా యింత రాద్ధాంతం దేనికీ? ఇప్పుడు మీ కేంలోటు జరిగిందనీ?" తగ్గుస్వరంలో ప్రశ్నించింది కుముదిని.

"లోటుకాదు కుముదం! నాకీ పద్ధతులిష్టంలేదని చెప్తే నువ్వెందుకు వినిపించుకోవు?" సూటిగా భార్యముఖంలోకి చూశాడు.

"……………"

"చేసేపనులు మానవు. అడిగితే ఈ మూగనోము. అలా కూర్చో, నీతో మాట్లాడాలి." కుర్చీ కుముదినికి దగ్గరగా జరిపాడు. కుముదిని ముఖం యిబ్బందగా పెట్టింది. "తెలియనట్టూ, ప్రొద్దున్నే పనివేళా యిలా మంకుపట్టుపడితే ఎలా ?"

"నాకంటే, నా మాటకంటె ఎక్కువా నీకాపనులు ? ఇంకా యింట్లో మనుషులున్నారులే పనులుచేయడానికి. ఈ విషయంయిప్పుడే తేలాలి." జబ్బపట్టుకుని బలవంతంగా కుర్చీలో కూలేశాడు.

"ఆ ప్రాణంలేని బొమ్మలలో ఏముందని ఆరాధిస్తావ్ ? ఎలాగుంటాడు దేవుడు? ఎప్పుడైనా కన్పించాడానీకు? నీ కోరికేదైనా తీర్చాడా ?" అక్షరం అక్షరంలోనూ ద్యోతకమౌతున్న ఆ హేళనాహంకారాలను వింటూ యిక సహించలేక పోయింది కుముదిని. "ఒకటేమిటి? అనేక కోరికలు తీర్చాడు. ఇంత సంతోషంగా బ్రతుకుతున్నామంటే ఆ దైవకృపకాక మరేమిటి? తేనె ఎలాగుంటుంది? తియ్యగా రుచిగావుంటుంది. ఆతీపీ, రుచీ ఎలాగున్నాయనిచెప్తే అర్థమౌతాయి? అటువంటివి అనుభవపూర్వకంగా తెలియాలే కాని, చెప్తే అర్థమవ్వవు. మన కర్థంకానివన్నీ అసంబద్ధాలు, అసంగతాలు కావు."

"అబ్బో, చాలదూరంపోయావు! అయితేనువ్వే మహాభక్తురాలవూ; నేను అర్థంకాని మూర్ఖుడినీ నన్నమాట!"

"అనవసరంగా వాగ్వాదం పెంచి ఒకటికి పదిఅర్థాలు తెస్తున్నారు. ఊహ వచ్చిననాటినుంచి, నేను పూజించి, ఆరాధించే దైవాన్ని ఈనాడు కేవలం మీకు నమ్మకంలేదు గనుక తృణీకరించారు? నిరంకుశ చక్రవర్తులుండేవారని చిన్నప్పుడు చరిత్రలో చదువుకున్నాం. ఇక వాళ్ళకూ, ఈ ఆధునిక యుగంలో వున్న మనకూ తేడా ఏమిటి?"

"ఆ హా హా, ఏం ఉపన్యాసం? చదువుకున్న భార్య అనిపించావ్!"

"అనిపించకే అలా మాట్లాడి అధికారం చెలాయించ గలుగుతున్నారు." అంటూ లేచిపోయి బయటకు నడిచింది, పొగలు గ్రక్కుతున్న భర్త దృక్కులనుండి తప్పించుకుంటూ.

వంటింట్లోకివెళ్ళి తిరిగి కాఫీ కలుపుతూంటే, "ఇంతకు ముందు తీసుకెళ్ళినదేమైంది?" అనడిగింది అత్తగారు.

ఒక్కక్షణం ఆలోచించి, "చెయ్యి జారిపోయింది." అంది కుముదిని.

"ఏం, అంత వదలు చేతులు?"

సమాధానం చెప్పకుండానే వెళ్ళిపోయింది కుముదిని.

కిటికీగుండా బయట తోటను చూస్తూ నిల్చున్నాడు కమలాకరం. పచ్చచామంతుల పసుపు నందుకొని, ఎర్రగులాబీల తిలకం దిద్దుకుని, రంగురంగుల నీలిగోరింటరవిక; ఆకుపచ్చని చీరధరించి నిల్చిన ధరణీకాంత ఉదయభాస్కరునికిచ్చే పరిమళ స్వాగతానికి శుకపిక శారికాదుల కలకల స్వనాలు

అనుబంధ వాయిద్యాలయ్యాయి. అప్పుడే ఎవరు మేలుకొలి పారో రంగురంగుల సీతాకోక చిలుకలు పువ్వుపువ్వునూ పలుకరిస్తున్నాయి. వర్షాగమనం సూచిస్తూ అసంఖ్యాకమైన తూనీగలు ఆకాశంలో వలయాలు చుట్టుతున్నాయి. ఉషస్సు ప్రాతః కాలంగా మారుతూంది. ఆ మూర్ధ ప్రకృతి సౌంద ర్యాన్ని తిలకించిన కుముదిని హృదయం ఉల్లాసంతో పరవళ్ళు త్రొక్కింది.

కమలాకరానికి దగ్గరగా వస్తూ "దేవుడే లేకపోతే ఈ చరాచర జీవరాసులన్నిటినీ యింత నియమబద్ధంగా నడిపించు తూన్న దెవరంటారు?" అంది కుముదిని.

వెనక్కు తిరిగాడు కమలాకరం, "ఏడీ ? ఆ నడిపించు తూన్న వాడెక్కడున్నాడో నీకన్పిస్తున్నాడా? నువ్వూ నేనూ లేచి తిరగడం లేదూ? అవీ అలాగే." నవ్విందికుముదిని. "మీరడ్డుగా వాదించితే నేను చెప్పలేను. కాని చూడండి – ఈ బల్లఉందంటే దానిని చేసిన ఒక వడ్రంగి ఉండాలి. ఇల్లుం దంటే కట్టినవాడుండివుండాలి. మన ఉనికికి కారణం మన తలి దండ్రులు. అలాగే ఈ చరాచర జీవకోటి నిండివున్న ఈ గంభీర జగతికంతకూ కారణభూతుడైన నిర్మాతవుండివుండాలి గదా! అతడే భగవంతుడు."

హేళనగా నవ్వాడు కమలాకరం. "అదే, అదే. ఇంత గొప్పపనులు చేసినవాడే గనుక వుంటే ఎవ్వరికీ కన్పించ కుండా ఎక్కడో చాటున వుండడమేమిటి? కొందర్ని అందంగా, కొందర్ని వికారంగా, కొందర్ని సుఖపడమని,

కొందర్ని కష్టపడమనీ, ఎందుకిన్ని తేడాలు ? చెప్పుమరి? భగ వంతుడి తరఫు వకీలులా వాదిస్తున్నావుకదూ?"

పసిపిల్లవాడి అమాయకతకు జాలిగా నవ్వినట్లు నవ్వింది కుముదిని. "సంతానమందరూ అందంగాపుట్టి, గొప్ప యోగ్యులవ్వాలని తలిదండ్రు లనుకున్నంత మాత్రాన సరిపోతుందా, అది వారి చేతిలోపనా? ఎవరి అదృష్టంవారిది. ఆ అదృష్ట రేఖలు తెలిసి, కర్మానుసారం సృష్టించేవాడే భగ వందదు! అంతా మన గొప్పే అయితే మన మనుకొన్నట్లు జరిగి తీరాలే మరి ? ఫలానాలా వుండాలనే మన ఊహాలూ, ప్రయత్నాలూ నామమాత్రమే. జరిగేది మరోలా జరుగు తుంది. అదే భగవద్విలాసం."

"మరి మరోలా జరిగి కోరికలు తీరినప్పుడు ఆ అర్థం లేని పూజలూ పునస్కారాలూ దేనికి?" గర్వంగా చూచాడుకమలాకరం. ఈ దెబ్బతో కుముదిని వాదం పగి పోయిందనుకున్నాడు.

కుముదిని తొణకలేదు. నిండుగానవ్వింది. "యుక్తా యుక్త జ్ఞానంలేక చూచిన ప్రతీదీ కావాలని మారాం చేసే పసిపిల్లలవంటిది మనస్సు, పిల్లలడిగిన వన్నీ యిచ్చెయ్యం. వాళ్ళకేది అవసరమో, ఏది ఉపయుక్తమో అదే యిస్తాం. అలాగే తన బిడ్డలమైన మనకు భగవంతుడు ఏది ఉచితమో అదే యిస్తాడు."

"మనను గురించి మనకు తెలియనిది మనను సృష్టిం చిన ఆయనకు తెల్సు. అది టలియక భగవంతుడిని దూషించి

లేదంటారామా? కేవలం కోరికల సాఫల్యం కోసమే దేవుడి నారాధిస్తామా? నిదురలేచిన దగ్గరనుండీ తెలిసీ తెలియకా తప్పనిసరిగా చేయవలసివచ్చే పాప కష్టనిష్ఠూర భూయిష్ఠమైన దినచర్య కుపక్రమించబోయే ముందు ఒక్కసారి ఆ భగవంతుని స్మరించి పాప ప్రక్షాళనకోసం నిర్మలాత్మతో వేడుకోవడం తప్పంటారా?"

కమలాకరుడికి సరైన సమాధానం దొరకలేదు. దానితో కోపం తారస్థాయి నందుకొంది. "నాన్సెన్స్. నీ చాదస్తపు వాదనలూ, నీ ఎమ్. ఏ. ఫిలాసఫీ నా దగ్గరకాదు. నేనొక మాటంటే అది జరిగితీరాలి. అంతే. మంచికి మనసే సాక్ష్యం. దేవుడక్కర్లేదు." విసురుగా గదిలోంచి వెళ్ళిపోయాడు. ఆమె వంటింట్లో అడుగు పెట్టేసరికి కమలాకరం తల్లినడిగి కాఫీ, టిఫిన్లు తీసుకోవడం కంటబడింది. మాట్లాడకుండా తన చేతిలో చల్లారిన కాఫీ క్రిందవుంచి వెళ్ళిపోయింది కుముదిని.

పూజ చేయటానికి ధరించిన పట్టుచీర మార్చి జడ అల్లుకుంటూంటే ఆమె ఆలోచనలు పలువిధాలుగాపోయాయి. 'ఇద్దరం చదువుకున్నవాళ్ళం. జీవితం ఎంతో ఆదర్శవంతంగా, అందరిలా కాకుండా ఎంతో ఉన్నతంగా, సుఖమయంగా వుంటుందని ఊహించాను. విద్యావంతుడైన భర్తవద్ద నా విద్యకొక విలువా, నా వ్యక్తిత్వానికొక గౌరవమూ లభిస్తాయని ఆశించాను. కాని యిదేమిటి ? ఎవ్వరికీ లేని నూతన

సమస్య ఎదురైంది! దైవపూజ అపరాధమా? అందరూ ఆస్తికులే అయిన ఈ కుటుంబంలో ఈయనకింత నాస్తికత్వం ఎలాగొచ్చింది?

ఆలోచనలలో ఉన్న కుముదిని అత్తగారు పిలువగా వెళ్ళి వంటగది గడపలో నిల్చుంది. సావిత్రి ఒక్కసారి కోడల్ని నఖశిఖపర్యంతమూ పరీక్షగా చూసి "అబ్బాయి అలా కోపంగా ఉన్నాడేం?" అనడిగింది. కుముదిని మౌనంగా తలవాల్చి నిల్చుంది.

"రెండుసార్లు తీసికెళ్ళికూడ మొగుడిచేత కాఫీ త్రాగించలేక పోయావు?"

అప్పటికీ మాట్లాడలేదు కుముదినీదేవి.

"ఇంతకూ ఏం జరిగిందంటే మాట్లాడవేమిటి? వాడి మట్టుకు వాడు రుసరుసలాడుతూ వెళ్ళిపోయాడు. నిన్నడిగితే మూగనోము. వాడికి కన్నతల్లిని, నీకు అత్తగారిని. ఆ మాత్రం వినదగిన అర్హత లేదూ నాకు?"

సజలనేత్రాలను పైకెత్తింది కుముదిని. "వినదగిన అర్హతా వుంది; సబబు చెప్పదగిన సమర్థతా వుంది. కాని అలా చెయ్యరు. అంతేగా?" నిష్ఠురమాడింది కుముదిని.

"ఊఁ," బరువుగా మూలిగింది సావిత్రి. "అయితే పాత పాటేనన్నమాట! పోనీ వాడికిష్టంలేని పనులెందుకు చేయడం? మానేయరాదూ?"

"అత్తయ్యా!" నిర్ఘాంతపోయింది కుముదిని. "దైవ పూజ మానమని పెద్దలు మీరు చెప్పవచ్చా?"

"పెద్దరికాలు, చిన్నరికాలు జ్ఞాపకమున్న యిల్లైతే పరిస్థితులింతవరకూ ఎందుకొచ్చేవి? నా మాట త్రోసేసి నిన్ను పెళ్ళిచేసుకున్ననాడే నా సమర్థత సమసిపోయింది."

శూలాలకు మల్లే తగిలిన ఆ మాటలకు యిక అక్కడ నిలువలేక పోయింది కుముదిని. తలిదండ్రుల మాట వినకుండా కుముదినిని పట్టుబట్టి కొడుకు పెళ్ళిచేసుకున్నాడని సావిత్రికి కోపం. 'ఎమ్మేపాసైన దొరసానిగారు!' ఇది ఆ అత్తగారి పరిభాషలో కోడలి నామధేయం. ఆమె అయిష్టతనూ, కోపాన్ని అలా అనేక రూపాలలో వ్యక్తీకరిస్తుంటుంది.

మధ్యాహ్నం కమలాకరం భోజనానికి రాలేదు. కారణం కుముదిని గ్రహించింది. 'ఆకలిగాలే' దంటూ ఆమె కూడ భోజనం మానేసింది. దానితో సావిత్రమ్మ సాధింపులు చెలరేగాయి. ఇంట్లో చిన్నా పెద్దా అందరికీ విషయం తెలిసిపోయింది. వెంకటచలం భోజనంచేసి లేస్తూ "కాస్త నా గదిలోకి మంచినీళ్లు తెచ్చిపెట్టమ్మా." అన్నాడు కోడలి నుద్దేశించి.

మంచినీళ్ళిచ్చి వస్తున్న కోడలి నాపుచేశాడు వెంకటచలం. "చూడమ్మాయ్. నేను పెద్దవాడిని; ఇలా చెప్పవలసిన ఖర్మ వచ్చింది. ఏమీ అనుకోకు. ఒకమాట చెప్తాను."

"మీమాట మీద నాకు చాలా గౌరవం. చెప్పండి." నమ్రతగా జవాబిచ్చింది కుముదిని.

"అందుకే చెప్పటానికింత బాధపడుతున్నాను." కొంచం సేపాగి మళ్ళీ ప్రారంభించాడు. "మన గమ్యం మనకు తెల్సు.

ఆ గమ్యం చేరడానికి ఒకబాటపై నడుస్తూంటే మధ్యలో ఏ క్రూరజంతువో, దుష్టజంతువో అడ్డువస్తే తప్పనిసరిగా ఆ బాటపై మన ప్రయాణాన్ని తాత్కాలికంగా మానుకోవాలి. కాని అది తాత్కాలికం మాత్రమే. స్వల్పకాలంలోనే ఆ ఆటంకాలు తీరిపోతాయి. మన గమ్యాన్ని చేరుకోగల్గుకాము. లేదా మరో బాట ఉండకపోదు."

భావగర్భితమైన ఆమాటలోని సూచనను అర్థం జేసుకో ప్రయత్నిస్తూ తలెత్తి చూచింది కుముదిని.

తిరిగి వెంకటచలం ప్రారంభించాడు. "నామాట నీకు సరిగా అర్థం కానట్లుంది. పసివాళ్లు మూడురకాలు. ఒకరకం వాళ్లు అమాయకంగా యితరుల్ని అనుసరిస్తారు; నల్గురితో కలసిపోగలరు; వారివల్ల బాధలేదు. ఇక జడపదార్థ రకాన్ని ఏ విధంగానూ మార్చలేము. వాళ్ళవుపయోగమూ లేదు – హానీ లేదు. ఏదో మూగగా, నీరసంగా బ్రతికేస్తారు. ఇక మూడో రకం ఉన్నారే – తెలిసీ తెలియని మూర్ఖులు. మిడి మిడి జ్ఞానాలతో మిడిసిపడ్తూ వాళ్ళూ బాధపడ్తారు. యితరుల్ని బాధపెడ్తారు. వాళ్ళనే మనం ప్రయత్నపూర్వకంగా మార్చవలసివుంటుంది. వయస్సుకు పెద్దవాళ్ళయినా భావ పరిపక్వత, సంఘటనలను సమన్వయ పరచుటకు సరిపెట్టుకు పోయే సమర్థతా లేనివాళ్ళు కూడా ఆ పసి మూర్ఖులలోనే జమ. అటువంటివాడికి విలువ వాడికే తెలియదు. ఇక యితరుల విలువేం తెలుస్తుంది? మరొకరి ఆధిక్యాన్నెట్లా భరించగలడు? తెలియని ఆ విలువను బలవంతంగా తెలియపరచ

ప్రయత్నించడం అవివేకం. అందువల్ల మరింత మొండికెత్తి పోతాడు. తాత్కాలికంగా కష్టమే అయినా మనమూ వాడి దారినే నడచి, అనునయంగా – దృష్టాంతరాలతో బోధించాలి. అది ఒక్కసారిగా సాధ్యంకాదు, కొంత కాల పరిపక్వత అవసరం అనుభవాలు నేర్పినంతగా తర్కవాదాలు మంచిని బోధించలేవు."

గ్రహించినట్లు తలపంకించింది కుముదిని. 'కడకు ఈ సలహా యిచ్చారా మామగారూ ?" అన్నట్లున్నాయి జలపూరిత నేత్రాలనుండి వెలువడుతున్న చూపులు.

"అంతకంటె మార్గం లేదమ్మా. మంచి అలవాట్లు బోధించడం పోయి మానుకోమ్మని సలహా యివ్వవలసి వచ్చింది. ఇదొక వింత అనుభవం." బాధగా తలదించుకున్నాడు వెంకటచలం.

తనగదిలోకి వచ్చేసి తీవ్రంగా తర్కించుకుంది తనలో తను కుముదిని. "భర్తచే విసిగించుకొని, అత్తగారిచేత అనిపించుకొని, మామగారి బోధలు వినడంకంటె – యిందరి దృష్టిలో పెంకెగా కన్పించడంకంటె నాలోనేను బాధపడితేనే మంచిదేమో ! బాధఅయినా తప్పదు మరి ! కడకు మామగారి సూచనే ఆచరణ యోగ్యంగా కన్పించింది." తనలో తన పూజలలో యేదో దోషముంది. అందుకే భగవంతుడిలా దూరం చేస్తున్నాడు తనను. అందుకే ఇటువంటి నాస్తికవాదిని భర్తగా సమకూర్చాడు. కాపురాని కొచ్చిన నాటి నుండీ యించుమించుగా ప్రతిరోజూ జరుగుతోంది రభస.

అదే యివ్వాళి కాస్త పెద్ద మోతాదులో పడింది. అసలు వివాహం నాటినుండీ కమలాకరం ప్రవర్తన అలాగేవుంది, విడ్డూరంగా. "తలంబ్రాలు పోయడానికి చంటిపిల్లలమా ?" అంటూ మండిపడ్డాడు పెళ్ళి పీటలమీదే; మానేశారు. 'బొమ్మల పెళ్ళికాదంటూ వూరేగింపును అభ్యంతరం చెప్పాడు; అమ్మ విలవిలలాడింది. పెళ్ళి జరిగిన మరునాటి ఉదయం నూతన దంపతులను దేవాలయానికి తీసుకువెళ్ళి మ్రొక్కించడానికి కుముదిని తండ్రిచేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయి. 'ఆరాతి విగ్రహాలకు మ్రొక్కేదేమిటి? అనవసరం. అన్నాడు కమలాకరం. బంధువర్గమంతా ఆశ్చర్యపోయి, ఈ నాస్తికుని గూర్చి పలురకాల వ్యాఖ్యానిస్తూంటే విద్యావంతుడూ, సౌందర్యవంతుడూ అయిన భర్త చుట్టూ మనసున నిర్మించుకొన్న ఊహానంద భవనపు పునాదులు కదలిపోయినట్లయింది కుముదినికి. ఇకనుండీ తన జీవనలత పెనవేసుకు పోవలసిన ఆ వ్యక్తి నాస్తికుడూ, నిర్లోభా నూటస్వుడూ అని తెలిసి నిలువునా గజగజలాడిపోయింది కుముదిని తనూలత.

కాని అతడి సాహచర్యం ఆమె భావించినట్లుగా గ్రీష్మ తాపంవలె కాదు. అతడినవ్వులో వెల్లివిరిసే ఆహ్లాదతా, చూపులలో తొణికిసలాడే మార్దవం, మాటలలోని మరులుగొలిపే మధురత్వం కుముదినిని తాత్కాలికంగా ప్రపంచాన్ని మరపింప జేశాయి. కానీ ప్రభాత కాలపు హిమబిందువు ఆయుః పరిమాణం వలె అనతికాలంలోనే ఆమె ఆనందం కూడ

అనల్పమైనదని తేలిపోయింది. అత్తవారింట అడుగెట్టగానే ఆమె దినచర్య కమలాకరానికి కరగతమైంది. ఆరంభంలో అనునయంతో, తర్వాత నిష్ఠూరంగా, ఆపైన బలవంతంగా భార్యలోని ఆస్తిక తత్వాన్ని నిర్మూలింప జూచాడు కమలాకరం. తన తర్క-వాదనలతో. బలీయమైన దృష్టాంతరాలతో భర్త నాస్తికత్వాన్ని రూపుమాప ప్రయత్నించింది కుముదిని. ఫలితంగా వాదోప వాదం అధికమై అనురాగం అదృశ్యమైంది. చినికి చినికి కడకు ఈరోజు గాలివానగా మారింది. ఎంత ఆలోచించినా భర్తయొక్క ఈ మూర్ఖత్వానికి కారణ మూహించలేకపోయింది కుముదిని. పోనీ అత్తగార్ని అడుగుదామంటే ఆమెకు ఆదిలోనే చుక్కెదురు కోడలంటే, తన విద్యా వినయ సౌందర్యాలతో, అంతకంటే అధిక కట్నమిస్తామన్న సంబంధం మానుకోనేటట్టు చేసి కమలాకరాన్ని కట్టేసిన కుముదినిపై సావిత్రికి కోపం. మామగారి ఎదుట కుముదిని మాట్లాడదు. అందువల్ల ఆమె మనస్సులో సందేహం సందేహంగానే వుండిపోయింది.

2

జ్యేష్ఠమాసపు ఎండకు శరీరం చిటచిటలాడుతోంది. వానలు తక్కువగా వుండటంవల్ల తాపం అధికమైంది. సుకుమార ప్రసూనాలూ, లేచిగుళ్ళూ ఆ తాపానికి సోలిపోయాయి, అనేక ఆలోచనలతో సతమత మౌతూ శాంతిని

కోల్పోయిన కుముద్వతీదేవి మనస్సు కూడ అలాగే సొలి పోయింది.

జ్ఞాన మొచ్చిన నాటినుండి ఆచరిస్తూన్న ఈ పూజలు మానడమంటే ఏదో అనిర్వచనీయమైన ఆవేదన కల్గుతోంది హృదయంలో. ఎన్ని పనులున్నా, చదువు తొందరలున్నా, పరీక్షలున్నా సరే ఈ ఉదయ పూజా కృత్యాలను మాత్రం ఎప్పుడూ మానుకోలేదు. ఏదో అనిర్వచనీయ నైర్మల్యతనూ, తృప్తినీ. ఆనందాన్నీ ప్రసాదించే ఈ కార్యక్రమం – యేడవ ఏటనుండీ ఈనాటివరకూ అవిచ్ఛిన్నంగా సాగిపోతూన్న ఈ నిర్దిష్ట పూజా విధానానికి ఈ రోజునుండీ కలుగబోతూన్న అంతరాయం తలచుకొన్న కొలదీ కుముదిని హృదయం విల విలలాడింది.

పుట్టింటి నుండి భక్తిగా, ప్రేమగా తెచ్చుకున్న రజిత దైవ పీఠాన్ని, విగ్రహాలనూ పవిత్ర స్థానం నుండితొలగించి, ట్రంకు పెట్టెలో భద్రం చేస్తూంటే చేతులు వణికాయి. దుఃఖం వెల్లుబికింది. అవిరళ బాష్పధారలతో ముఖంమలిన మైంది.

"రేపటినుండీ నీకు పూజలు జరుగవు. నైవేద్యం వుండదు. ఈ అపరాధాన్ని మన్నించు; ఎటువంటి శిక్షా వెయ్యకు ప్రభూ ! ఆచరణలను అరికట్టగలరు కాని అంతరం గాన్ని ఆదేశించ గలరా? నా ప్రత్యణువులోను జీర్ణించుకు పోయిన నీపై భక్తినీ, నా ప్రతిరక్త బిందువూ జపించే నీ నామాన్నీ, నా హృదయ పీఠంపై నెలకొన్న నీ రూపాన్నీ

తొలగించగలరా"? ఆక్రోశించే హృదయంతో పెట్టెపై తల వాల్చింది కుముదిని. భోజనం లేక నీరసంగా ఉన్న మేను, ఆలోచనలతో వేడెక్కిన మెదడూ తాత్కాలికంగా విశ్రాంతి తీసుకున్నాయి.

"కుముదా !" ఆఫీసునుండి వచ్చిన కమలాకరం పిలుపుకు నేలపై కూర్చుని పెట్టెపై తలవాల్చి కలత నిద్రలో పడిన కుముదిని వులిక్కిపడి లేచింది.

"వేళగాని వేళ ఆ నిద్రేమిటి ? అరే, ముఖం అలా వుందేం ? ఏడ్చావా ? ఎందుకు ?" అతడి ప్రశ్నా పరంపర అలా సాగిపోతూనే వుంది – కుముదిని సమాధాన మివ్వకుండా త్వర త్వరగా వెళ్ళిపోయింది. అయిదునిముషాల అనంతరం కాఫీ కప్పుతో తిరిగివచ్చిన కుముదిని ముఖంలో ఛాయామాత్రంగా కూడా విషాదం లేదు. కమలాకరం మౌనంగా కాఫీ అందుకున్నాడు. ఆరోజు పోస్టు, న్యూస్ పేపర్లు తెచ్చి భర్త దగ్గరుంచి, తనూ క్రింద తివాచీమీద కూర్చుని సన్నజాజుల పళ్ళెం దగ్గరకు తీసి మాలకట్ట సాగింది. ఆమె చేస్తున్న పనిని పరీక్షగా చూచాడు కమలాకరం, ఏవో భావాలను మనస్సులో అణచి పెట్టడానికి. భావాల మార్పు కోసం ఆపని సృష్టించుకున్నట్లుంది కాని-అందు మీద మనసుంచి చేస్తున్నట్లులేదు, ఆ మాలకట్టే తీరు. పదినిముషాలు అలాగే మౌనంగా గడచిపోయాయి.

"కొంచం చదివి వినిపించగలవా ?" అన్నాడు కమ
లాకరం సోఫాలో వెనక్కి వాల్తూ, ఆమెను క్రీగంట చూస్తూ.
మధ్యాహ్నం భోజనానికి కూడా రాని అతడికోపం ఏంమాట్లా
డితే ఎటుతిరుగుతుందో ననేభయం సంకోచాలతో మౌనంగా
వున్న కుముదిని ఆ శాంత స్వరానికి ఆశ్చర్య పోతూ కళ్ళెత్తి
చూసింది. తననే ఓరగా చూస్తున్నాడు కమలాకరం. పూల
సూల పళ్ళెంలో వుంచి టీపాయ్ మీద పెట్టి, వెళ్ళి కమలా
కరం ప్రక్కనే సోఫాలో కూర్చుని ముందు ఆరోజు వచ్చిన
లెటర్సు చదవడం పూర్తి చేసింది. న్యూస్ పేపరు చేతికి
తీసుకుంటూండగా "ఏమండీ, అంతముభావంగా వున్నారు ?"
అన్నాడు కమలాకరం కొంటె చిరునవ్వుతో.

"నేనా ? లేదే !" మెల్లని స్వరంతో అన్నది కుము
దిని.

"మరి ? మధ్యాహ్నం భోజనానికి రాలేదేమని
అడిగావా ?"

ఒక్క క్షణం ఆగి మెల్లగా అంది కుముదిని. "ప్రొద్దున్న
కాఫీ ఫలహారాలు నేనిస్తే పనికిరానప్పుడు మధ్యాహ్న భోజ
నానికి ఎందుకురాలేదని అడిగే అర్హత నాకు లేదనుకున్నాను.
నా గురించే రాలేదని వూహించాను. ఇప్పుడిక తప్పని సరిగా
ఇల్లు జేరారు."

నిర్లిప్తంగా ఉన్న ఆ ధోరణికి పక పకా నవ్వేశాడు
కమలాకరం, "అందుక్కాదు కుముదా. ఆఫీసులో ఒక ఫ్రెండ్
బర్త్ డే పార్టీ యిచ్చాడు, మస్తుగా."

మాట్లాడలేదు కుముదిని.

తిరిగి కమలాకరమే అన్నాడు, "పొద్దున్న నాకు నిజంగా చాలా కోపం వచ్చింది కుముదా. అలా నాకిష్టంలేని పనులు ఎప్పుడూ చెయ్యకు. మానేస్తావుకదూ ?"

కుముదిని జవాబివ్వకుండా త్వరత్వరగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

స్నానం చేసి లోపలికి వస్తూన్న కొడుకు నుద్దేశించి, కేకపెట్టింది సావిత్రి. "త్వరగా భోజనానికి రా నాయనా! నీవు మధ్యాహ్నం రాలేదని ఆవిడ ఉపవాసాలు చేస్తోంది. నిండు యింట్లో ఈ అభోజనాలు నేను సహించలేను".

"అయితే నువ్వు మధ్యాహ్నం భోజనంచెయ్యలేదా?" అనడిగాడు గదిలోకివచ్చి కుముదినిని పరీక్షగా చూస్తూ.

"ఇప్పుడు చేస్తాను. ముందు మీరు నడవండి." అంది కుముదిని మెల్లగా. కమలాకరం హృదయంద్రవించి పోయింది. "నాకు కోపం వచ్చేటట్టు ప్రవర్తించడ మెందుకు ? ఆపైన యిలా బాధ పడడమెందుకు ? నన్నర్థం చేసుకో కుముదా, ఆ మూఢ విగ్రహారాధన అంటే నాకు ఒళ్ళు మండి పోతుంది."

"మరి మా అమ్మగారు చేస్తూంటే మాట్లాడరేం ?"

"అదివేరు ! అమ్మ లాలన పాలనలలో పెరిగిన నాకు అమ్మను శాసించగల అధికారం లేదు. కాని నువ్వు నా అర్ధాంగివి. భార్య తన మాటవిూరడం నేనే కాదు, బహుశః ఏ మగవాడూ సహించ లేడు."

అంతవరకూ మమతా మార్దవం తొణికిసలాడిన కన్నులూ, కంఠమూ తిరిగి కర్కశత్వాన్ని నింపుకోవడం చూచిన కుముదిని అదిరిపడింది. "వద్దు. హక్కులు, అధికారాలు అనే పదాలు మన మధ్యకు రానివ్వకండి. మీకు నేను కష్టం కలిగించను." అంటూ అక్కడినుంచి తప్పుకొంది.

మర్నాడు ప్రాతఃకాలం కుముదిని అనుభవించిన మనోవేదన వర్ణనాతీతం. జ్ఞానం కలిగిన నాటినుండీ అవిరామంగా చేస్తూన్న ఆ దైవపూజను నేడు మానుకోవడంతో శరీరంలో ఏదో భాగాన్ని దూరంచేసుకున్నట్లే అన్పించింది. ఆరోజంతా చెప్పలేని దిగులుతో హృదయంలో రంపపుకోతగానేవుంది. సాయంకాలం ఆఫీసునుంచి త్వరగా వచ్చేశాడు కమలాకరం.

"అలా ఎక్కడైనా వెడదాంపద" అన్నాడు భార్యతో. మారుమాట్లాడకుండా పదినిముషాల్లో తయారై వచ్చి జోడు తొడుక్కొంటూన్న కుముదినిని చూస్తూ "సినిమాకెళ్దామా, షికారా?" అనడిగాడు.

"మీ యిష్టం."

"ఊహూ. నీ యిష్టం. నా యిష్టప్రకారం నువ్వు నీ పూజలు కట్టిపెట్టావు. గనుక యిక అన్ని విషయాలలో నీ యిష్టానువర్తిని." అన్నాడు కమలాకరం చిరుదరహాసంతో.

కుముదిని తొణకలేదు. "సంతోషం. కాని మీ యిష్టమే నాయిష్టం, పదండి." అంది గంభీరంగా.

నాల్గురోజుల అనంతరం ఒక రాత్రి వెంకటచలం, కమలాకరం భోజనం చేస్తున్నారు. కుముదినీ, సావిత్రీ వడ్డన చేస్తున్నారు.

వెంకటచలం హఠాత్తుగా తలెత్తి, "ఇవ్వాళ అమ్మాయి మామగారు ఉత్తరం వ్రాశారు, త్రయోదశి నాడు అమ్మాయిని తీసుకెళ్ళమని. నాకు చాలా పనులున్నాయి. వెళ్తావట్రా కమలా, పద్మను తీసుకురావటానికి?" అనడిగాడు.

"సెలవుదొరకదేమోనాన్నా. పోనీ శనివారం రాత్రికి వెళ్ళి ఆదివారం తీసుకొస్తాను."

"అమావాస్యనాడు అత్తింటికోడల్ని పుట్టింటికి తీసుకొస్తావా? ఛ, ఇంత అజ్ఞానుడవేమిరా?"

"నాన్సెన్స్. అమావాస్యేమిటి, పౌర్ణమేమిటి? చాదస్తం. అసలు నేను వెళ్ళనే వెళ్ళను. అయినా ఎందుకేమిటి యిప్పుడింత అర్జంటుగా దాన్ని తీసుకురావడం?"

తల్లి అందుకుంది. "అంత తెలియకుండా వున్నావన్నమాట? అమావాస్య వెళ్ళగానే ఆషాఢం మొదలు. క్రొత్త కోడళ్లు, అల్లుళ్లు ఆషాఢంలో అత్తింట వుండకూడదు. నీకు తగిన అత్తారే నీకూ దొరికారు. ఇంక నాల్గురోజులైనా లేదు అమావాస్య. ఉత్తరం లేదు; మనిషీ లేదు!" మాటిమాటికీ కోడల్ని సూటిపోటిమాటలనడమే సావిత్రి కానందం.

కుముదిని చిన్నబుచ్చుకుంది. కమాలకరం ఆశ్చర్యంగా చూశాడు. "మరీ పూజలు, దేవుళ్లు అనే పట్టింపుగల కుము

దిని పుట్టింట్లో యిటువంటి నమ్మకాలు మాత్రం వుండకుండా వుంటాయా? ఎందుకు రాలేదో?" అనుకున్నాడు.

వెంకటచలం మాత్రం బాధపడ్డాడు కోడలి విచార వదనం చూచి. "ఇంకా నాల్గులోజులుంది, వస్తారులెద్దూ. వెధవతొందరా నువ్వూనూ" అని భార్యను సన్నసన్నగా మందలించాడు.

3

కమలాకరం ఆఫీసునుండి మధ్యాహ్నం వచ్చేసరికి హాల్లో కుముదిని తండ్రి అనంతయ్యా, వెంకటచలమూ మాట్లాడుకుంటూ కన్పించారు.

"అల్లుడుగారు కులాసా? ఉత్తరానికి జవాబేయిచ్చారు కాదు?" అని పలుకరించాడు అనంతయ్య.

"ఉత్తరమాండీ?" ఆశ్చర్యంగా అడుగుతూ దగ్గర కూర్చున్నాడు కమలాకరం.

"అమ్మాయిని ఎప్పుడు పంపిస్తారో వ్రాస్తే వస్తానని వ్రాశాను. మీ జవాబు కోసం వారం రోజులు చూచి ఇక వచ్చేశాను"

"అరే! అందలేదండీ. మీకు జవాబివ్వకుండా వుంటానా?" అంటూ లేచి లోపలికి వెళ్ళాడు.

కిటికీ దగ్గర పరధ్యానంగా నిల్చున్న కుముదిని వెను తిరిగి చూచింది.

"మీ నాన్నగారు లెటరు వ్రాశానంటూ లేమిటి?" అని అడిగాడు కమలాకరం.

"నాన్నగారు మీకు ఆషాఢపట్టి తెచ్చారు చూశారా" అని ప్రసంగం మార్చింది కుముదిని. ఉత్సాహంగా చూశాడు కమలాకరం. "ట్వీడ్ సూటింగ్ క్లాత్, ముత్యపు వుంగరం, ఏడువందల నగదూ" భర్త ముఖ కవళికలు మాయమవ్వకుండా నిలిచే వుండటం చూచి లోలోపల తృప్తిగా నిట్టూర్చింది.

"అంతా బాగానే వుంది కాని— ఏమిటీ ఆషాఢపట్టీ, శ్రావణ తగవూను, పాతపద్ధతులు కాకపోతే? పెళ్ళినాడయ్యా యిగా కట్నాలు, కానుకలూను? మళ్ళీ ఈ జిడ్డంతా వదిలించు కోడం దేనికి?"

"నాన్నగారి దగ్గర మాత్రం అలాగనకండి. చిన్న బుచ్చుకుంటారు. ఎంతో సరదాగా తెచ్చారు. అవి మన పద్ధతులు."

"అదేం సరదా? నేనందరల్లుళ్ళవంటి వాడిని కాదని ఆయనకు తెలియదేమో! వుంగరమూ, బట్టలూ తీసుకుంటాను మర్యాదకు. ఆ డబ్బు యిచ్చెయ్యి. అల్లుడిహోదాలో అత్తవారిల్లు గుల్ల చేయడమంటే అసహ్యం నాకు."

నవ్వింది కుముదిని. "తెల్సులెండి. మీరు చాలా మంచివారట! కాని ఈసారికి తీసుకోండి. నాన్నగారితో

చెప్తాను, మీా కిష్టంలేదనీ, యికనుంచి అలా చెయ్యొద్దనీ" జవాబు కోసం ఎదురుచూడకుండా భోజనాలు ఏర్పాటు చేసే మిషతో వెళ్ళిపోయింది.

వియ్యంకుళ్ళిద్దరూ, కమలాకరమూ ఒక్కసారే భోజనానికి కూర్చున్నారు. సావిత్రి వడ్డన చేయసాగింది చాలా ఆదరంగా మాట్లాడుతూ. ఆ తెచ్చిపెట్టుకున్న కలుపుగోలుతనం చూచి కుముదిని ఆశ్చర్యపోయింది. కొడుక్కు పండగ లాంచనం దండిగా ముట్టిందనే సంతోషమో లేక వియ్యంకుడి దగ్గర నటనో తేల్చుకోలేక పోయింది.

"రేపు త్రయోదశి. ఉదయం ఏడు గంటలకు బాగుంది. శ్రావణమాసం నోములు కూడా అయ్యాక పంపిస్తాను." అన్నాడు అనంతయ్య జనాంతికంగా.

"అలాగే తీసుకెళ్ళండి. నిన్ననే అన్నాను. ఎంచేతనో వియ్యంకుడుగారు ఉత్తరం వ్రాయలేదనీ, మా అమ్మాయిని కూడా రేపేతీసుకొస్తాం అత్తారింటిదగ్గర్నుంచి" అంది సావిత్రి కలివిడిగా.

కుముదినీ కమలాకరం ముఖముఖాలు చూసుకున్నారు.

కమలాకరం సాయంత్రం వచ్చేసరికి కుముదిని గదిలో కుముదినీ, అనంతయ్యా కూర్చుని మాటాడు కుంటున్నారు.

"అయితే చిన్నక్కయ్య గురించి ఉత్తరంలో వ్రాయలేదేం నాన్నా? శ్రావణ మాసాని కొస్తుందా?" అనడిగింది

కుముదిని. అనంతయ్యేకాక, అప్పుడే లోపల అడుగుపెట్టిన కమలాకరం కూడ ఆశ్చర్యపోయాడు.

"ఉత్తరం అందలేదన్నావు కదమ్మా మరి ?" అన్నాడు కూతుర్ని పరీక్షగా చూస్తూ అనంతయ్య.

తొట్రుపడింది కుముదిని. కమలాకరం ముఖం కూడ సమాధానం కోసం చూస్తున్నట్లు కన్పించగానే కలవర పాటుతో "కాఫీ తెస్తాను," అంటూ వెళ్ళిపోయింది. మామా అల్లుళ్ళిద్దరూ ముఖముఖాలు చూచుకున్నారు. ఆమె ఏదో దాస్తోందని గ్రహించారు. కాని ఎవ్వరూ మాట్లాడలేదు.

మళ్ళీ ఒంటరిగా ఉన్నప్పుడడిగాడు అనంతయ్య కూతుర్ని. "అందింది నాన్నా, కాని ఒక విషయముంది. ఇప్పుడు చెప్పలేను." అంది ముక్తసరిగా కుముదిని.

రాత్రి కమలాకరం అడిగాడు. మొదట కుముదిని చెప్ప లేదు. తర్వాత తప్పనిసరిగా చెప్పింది.

"ఆ లెటరు మీ చేతిలో పడితే ఇటువంటివి నమ్మను. పంపను, అని వ్రాస్తారని నాకు తెల్సు. మిమ్మల్ని గురించి అందరూ అన్నివిధాలా అనుకోవడం నాకిష్టంలేదు. అందుకే దాచేశాను."

కమలాకరం కృతజ్ఞతా పూర్వకంగా నవ్వాడు. "నా మీద అంతగౌరవముంచినందుకు సంతోషిస్తున్నాను, కుముదా. అయితే నీకు కోపం లేదన్నమాట నా మీద ?"

"కోపం దేనికిలెండి. నాన్నగారితో వెళ్తే అక్కడ తప్పనిసరిగా నోములూ, పూజలూ చెయ్యాలి. లేకుంటే కారణం చెప్పి మిమ్మల్ని అనిపించాలి. మీలో మార్పు వచ్చేవరకూ మీకు కష్టంలేని పనిచేయకూడదని నిశ్చయించుకున్నాను."

కమలాకరం మాట్లాడలేదు. కాని అతడి నేత్రాలలోనే కుముదినిపై అనురాగం తొణికిసలాడింది. తిరిగి కుముదిని అన్నది. "ఆషాఢంలో అత్తవారింట క్రొత్తల్లుళ్ళు, కోడళ్లు వుండకూడదని నమ్మిక. నా అభిప్రాయమెలా వున్నా అత్తగారు ఉగ్రులైపోతారు నేనిక్కడుంటే. ఇంట్లో నామూలంగా నరకం బయల్దేరుతుంది."

"ఊఁ. మరైతే ఏం చేద్దామంటావ్ ?"

"ఉన్న పరిస్థితి వివరంగా మీకు చెప్పాను. నిర్ణయించవలసినది మీరు."

కొద్దిసేపాలోచించి అన్నాడు కమలాకరం— "ఆఫీసుకు సెలవుపెట్టి మనం యెక్కడైనా వెళ్దాం ?"

"నాకూ అదే తోచింది. నాన్నగారిచ్చిన ఏడు వందలూ వుండనే వున్నాయిగదా !"

అనంతయ్యకు అసలు విషయం అవగాహన కాకపోయినా ఏదో విశేషముందని మాత్రం గ్రహించగలిగాడు. "వాళ్లు తిరుగుతామంటున్నారుకదా ! నీ దగ్గర వుంచుకో యీ డబ్బు" అని కూతురికి ప్రత్యేకంగా నాలుగు వందలిచ్చి వెళ్ళిపోయాడు.

"నాన్న యిచ్చిన డబ్బు మూలిగిపోతుందనుకొన్నావా? ఇప్పుడెందుకీ ప్రయాణం? లక్షణంగా పుట్టింటికి వెళ్ళకూడదూ?" చాటున సావిత్రి మండిపడింది కోడలు మీద.

"వెళ్ళి ఏం చేయను? ఆయనకిష్టంలేని పని చెయ్యొద్దని మీరే అన్నారుగా?"

"అక్కడ నువ్వేం చేస్తున్నావో వాడు చూడొచ్చేడా?"

"అటువంటి దొంగబ్రతుకు నాకిష్టంలేదు."

చోద్యంగా బుగ్గలు నొక్కుకుంది సావిత్రి. "ఓ దేవుడూ భయమూ లేకుండా మంచివంకే దొరికింది. ఈపాడు చదువొచ్చి యిన్ని పోకులొచ్చాయి."

"అనవసరంగా సరస్వతిని దూషించి నోరు పాడుచేసుకోకండి. అయినా దేవుడు మానవమాత్రులంత నిర్దయుడూ, మూర్ఖుడూ కాదు." తనలో తనే ఆశ్చర్యపోయింది కుముదిని, అత్తగారితో అంత కటువుగా మాట్లాడ గలిగినందుకు.

పెట్టె సర్దుతున్న కుముదిని నడిగాడు కమలాకరం. "ఎక్కడికెళ్దాం?"

తలెత్తిచూచి, తిరిగి తనపనిలో నిమగ్నమైంది కుముదిని.

"మీ యిష్టం." అంటూ నవ్వాడు కమలాకరం. కోపం లేనట్టు వుంటున్నావుగాని నిజంగా నామీద నీకు కోపంగానే వుంది కుముదా."

ప్రశ్నార్థకంగా చూచింది కుముదిని.

"ఏమడిగినా నా యిష్టానికే వదిలేస్తున్నావు. నీకో అభిప్రాయమంటూ ఏమీ లేదా?"

"అభిప్రాయాన్ని మొండిగా ఆచరించడం కంటె ఆత్మ గౌరవం నిలుపుకోవడం ప్రధాన మనుకొంటాను."

"అంటే ?"

"అహంభావివద్ద అంతరాన్ని ప్రదర్శించి అలుసయ్యే కంటే అభిమానంగా అణగద్రొక్కుకోవడం అన్ని విధాలా మంచిది." సూటిగా తగిలిన ఆ మాటలను అభిమానంగా లేచి కూర్చున్నాడు కమలాకరం.

"అడుగడుగునా అహంభావి, నిరంకుశుడూ అను కుంటూ బలవంతంగా నీ అభిప్రాయాలు మార్చుకోనవసరం లేదు కుముదా. నాక్కావలసింది సంతోషంగా నన్నర్థం చేసుకొని సహకరించే సహచారిణి. నీ వేషభాషలు చూచి పాత వాసనలేని సంస్కారవతి వనుకొన్నాను. కాని తెలిస్తే నువ్వెంత అందంగా వున్నా. ఎంత చదువుకొన్నా కక్కుర్తి పడకపోదును."

చాలా శాంతంగా జవాబిచ్చింది కుముదిని.

"ఏదో సమాధానం చెప్పాను కాని మీకింత కోపం వస్తుందనుకోలేదు. క్షమించండి."

"సరే, ఏమిటి నీ అభిప్రాయం? ఎక్కడికెళ్దామని?"

నిశితంగా చూస్తూ అంది కుముదిని. "మీతో వివాహమైతే తిరుపతి వెళ్ళాలని మిమ్మల్ని చూచిన నాడే మ్రొక్కుకున్నాను. తీరుస్తారా ఆ కోరిక ?"

కమలాకరం ముఖం అరుణిమ దాల్చింది. నన్ను వంచించాలని, అవమానించాలనీ నీ కోరికా ? అవకాశాలను సద్వినియోగం చేసుకోనివాళ్ళ కసలవకాశా లివ్వడమే అనవసరం. ఇంట్లో కూర్చుని నీ మనసులో నువ్వెవరినో పెళ్ళాడాలని కోనుకొంటే ఎక్కడో తిరుపతిలోవున్న విగ్రహానికి వినబడి నీకోరిక తీర్చేసిందా ?"

వణికిపోయింది కుముదిని. శరీరం జలదరించింది, గుండెలు కొట్టుకున్నాయి. కనులు విపరీతంగా చలించాయి. తుపాను గాలిలో లతలాగా తనూలత గడగడ లాడింది. ఇక అక్కడ నిల్చుంటే వాగ్వాదం పెరగగలదనే భయంతో లేచి మరో పని మిషతో అక్కడనుంచి వెళ్ళిపోయింది.

4

విజయవాడ, నాగార్జునసాగర్, మహాబలిపురం, మద్రాసు, తిరుచునాపల్లి, మైసూరు, బెంగుళూరు, హంపీ అన్నీ తిరిగిచూచారు కమలాకరం, కుముదినీ. ఇద్దరూ కూడా చాలా వుల్లాసంగా గడిపారు. కాని ఎంత కలసి మెలసి తిరిగినా, ఎంత సర్దాగా అరమరికలు లేకుండా ప్రవర్తించినా

తమ మధ్య ఏదో పూడని అగాధం వున్నట్టూ, అగోచరమైన అవనిక ఏదో ఇరువురి మధ్యా వ్యాపించినట్లూ ఇద్దరికీ అనిపించేది. అదేమిటో మాత్రం అవగాహన కాలేదు. పైకి వెల్లడించడానికి ఎవరిమట్టుకు వారికే సంకోచం. తనకు తోచినట్టు చెయ్యడమే కాని ఏ విషయంలోనూ కుముదిని అభిప్రాయం అడిగేవాడు కాదు కమలాకర. ఏమంటే ఏం కోపమొస్తుందో నన్నట్లు కుముదిని చూచి చూచి మాట్లాడేది.

తిరిగి తిరిగి మళ్ళీ మద్రాసు జేరుకొన్నారు.

“అయిపోయిందా నీ ఆషాఢం, యింకావుందా?” అనడిగాడు కమలాకరం హోటలు రూములో మేనువాల్చుతూ.

నవ్వు వచ్చింది కుముదినికి. “నా ఆషాఢమేమిటి? నేనుగాని సృష్టించానా?”

“అంటే నీవంటి వాదస్తులు సృష్టించినది.” ఇద్దరూ నవ్వుకున్నారు.

“ఎల్లుండి అమావాస్య గడవడంతో శ్రావణ మాసం మొదలు ఈ రెండు రోజులూ మద్రాసు చూచి ఎల్లుండి సాయంత్రం మెయిలుకు వెళ్ళిపోదాం.” అంది కుముదిని.

“ఈ నెలరోజులూ పద్మతో సరదాగా గడిచిపోతుంది” అంది తిరిగి ఏదో ఆలోచిస్తూ తనలో తను అనుకుంటున్నట్టు.

“ఆఁ అఁ ప్రతి మంగళవారం నాప్రాణాలు తీసేవాళ్ళు ఒకళ్ళకొకళ్లు తోడౌతారు కాబోలు.” అన్నాడు తీవ్రంగా కమలాకరం.

"అంత మాటనిలకడలేని దాన్నికాదు". విసురుగా వాలుకుర్చీలో పడుకుని ఏదో పుస్తకం పేజీలు తిరగెయ్య సాగింది కుముదిని. కమలాకరం లోలోన నవ్వుకుంటూ లేచి తలుపుతీసుకు బయటకువెళ్ళి పావుగంటలో తిరిగి వచ్చాడు.

"నే నెవరో నీకు తెలుసా, మనసా తెలుసా?" కొంటెగా పాడుతూ కుముదినిని చూచాడు. కుముదిని పుస్తకం మీది నుండి దృష్టి మరల్చలేదు.

రేపు తెలుస్తుందిలే. ఓ కుముదినీదేవీ !"

తమాషాగా నవ్వుతూ హాయిగా పడుకుని నిద్రపోయాడు కమలాకరం. ఆ హుషారుకు కారణమేమిటో తెలియక ఆశ్చర్యపోయిందికుముదిని విజయగర్వం కాబోలు అని సరిపెట్టుకుంది.

మర్నాడుదయం టాక్సీలో సామానంతా పెట్టించేసి హూమ్‌రెంట్ యిచ్చేస్తూంటే ఆశ్చర్యంగా చూసింది కుముదిని భర్తవైపు. ఇక కారు సాగిపోతూంటే మాత్రం అడగకుండా వుండలేకపోయింది.

"నువ్వు తిరుపతి వెళ్ళాలనుకున్నావుగా!" అన్నాడు అతి సాధారణంగా తనచెవులను తనే నమ్మలేకపోయింది కుముదిని. కొంతసేపటికి తమాయించుకుని "హాస్యమా ?" అంది.

"కాదు" అంటూ ఇటు తిరిగాడు కమలాకరం.

"నువ్వు మాటనిలకడ లేనిదానవుకాదుగా? నేనూ అంతే నీ మనస్సులో కోరిక నీ చేత బలవంతంగా చెప్పించి నప్పుడు తీర్చటం నా విధి కాని యికమీదట మాత్రం అటువంటి అవకాశాలు లేకుండా చేసుకొన్నావు."

విని మౌనంగా వూరుకుంది కుముదిని. కాని మనస్సులో పరవళ్లు త్రొక్కుతూన్న సంతోషాన్ని మాత్రం కన్నులలో ప్రతిఫలింప జేయకుండా అరికట్టలేకపోయింది. రాత్రి అతడు అతి చతురంగా చెప్పిన విషయం ఇదా? అని ఆశ్చర్యపోయింది.

టాక్సీ తిరుపతి కొండ ఎక్కుతూంటే అనతికాలంలో నే తన ఇష్టదైవాన్ని దర్శించబోతూన్న సంతోషంతో కుముదిని హృదయం మయూరంలా నాట్యం చెయ్యసాగింది. ఆ వున్నత పర్వతశిఖర సౌందర్యాన్ని తిలకించటానికి నేత్రద్వయం చాలదనిపించింది.

ఆలయానికి వెళ్తూ కుముదిని కన్నీళ్ళతో ప్రాధేయపడింది భర్తను.

"మీ పట్టుదల మాని ఎటూ తీసుకొచ్చారు నాకోసం అలా నాకోస మేరండి ఇంతవరకూవచ్చి ఆ శ్రీనివాసుడిని దర్శించకుండా వెళ్ళడమా? జంటగా దర్శించుకుంటామని మొక్కుకున్నాను నేను."

విసుక్కున్నాడు కమలాకరం. నువ్వు మొక్కుకోవడంలో నా బాధ్యత ఏమీలేదు. నాచేత ఆస్టే అనిపించక నీపనులు తెముల్చుకో. గుళ్ళో కూర్చున్న నల్లరాయిని కోరి

దర్శించుకోవలసిన అవసరం లేదు నాకు. కేవలం నీ కోరిక తీర్చడానికే యిప్పుడిక్కడికొచ్చింది. ఆలయానికి రావడం నావల్లకాదు." ముసుగుదన్ని పడుకున్నాడు. అసలే మనిషి చేత ఈ పుణ్య క్షేత్రంలో నోటికొచ్చినట్టు వాగించకూడదు అని తలపోసి కుముదిని మరి బలవంతం చెయ్యలేదు భర్తను.

పూర్ణాలంకృత శోభితుడైన శ్రీ వేంకటేశ్వరుని దర్శించుకొన్న కుముదిని మనస్సంతా సంతోష సంభ్రమాలతో నిండిపోయింది. ఆపాద మస్తకమూ కళకళలాడి పోతూ వజ్రకవచంతో, వైకుంఠ హస్తంతో, ధవళకాంతు లీనే గోవిందనామాలతో, వజ్రమయ శంఖుచక్రాలతో, నవరత్న ఖచిత కిరీటంతో దేదీప్యమానంగా వెలుగొందుతూన్న ఆ భువనమోహన కళ్యాణ రూపాన్ని చూడగానే జన్మతరించిపోతుంది. మనస్సు పరవశమౌతుంది. హృదయ భారాలు తొలగిపోయి అనిర్వచనీయానంద సంతృప్తి ఆవరిస్తుంది. "ఆ పవిత్ర గంభీర ప్రశాంతమూర్తిని చూస్తూ ఎవరైనా దేవుడు లేడని అనగలరా?"

బహుదూరం వచ్చీ భగవత్ దర్శనానికి దూరమైన భర్తలోని లోపానికి బాధపడుతూ బసచేరుకుంది కుముదిని. ఆమె దుస్తులు మార్చి, సిద్ధంగావున్న కారియర్ తీసి భోజనం వడ్డిస్తూంటే అప్పుడు ముసుగుతీసి లేచివచ్చాడు కమలాకరం భోజనానికి.

"మధ్యాహ్నం రెండు గంటల వరకూ తిండి తినవద్ద

న్నాడు కదూ దేవుడు? అర్థంలేని ప్రయాసాలు ఏం, కాస్త కాఫీ, టిఫినూ తీసుకువెళ్తే ఆ దేవుడు కన్పించనన్నాడా? దైవదర్శనానికి ఫలితం ఆకలిబాధన్నమాట!" హేళనగా అన్నాడు.

"నాకోసమెందు కూర్చోవాలి? మీరు కానివ్వలేకపోయారా? ఆ ఆలయంలో అడుగిడితే ఆకలికాదు సరికదా, యికే యే ధ్యాసా వుండదు. ఆ దైవదర్శనంతోనే కడుపునిండిపోతుంది."

"ఓహో, ఏం భక్తి!" హేళన ధ్వనించిందతడి కంఠంలో.

టాక్సీ కొండ దిగుతూంటే చూపట్టే సుందర దృశ్యాలతో తనువు పులకరించింది కుముదినికి. కొండ వాళ్ళ ప్రక్క మెలికలు తిరిగిన బాటమీద అందంగా పరుగులిడుతూన్న కార్లు, బస్సులూ. రాళ్ళ నడుమనుండి మధ్యమధ్య ఒయ్యారంగా జాలువారుతున్న నీటిధారలూ, ఆ వున్నత ప్రదేశం నుండి చిత్రంగా చూపట్టే క్రింది బాటలూ: దిగువ తిరుపతి నగర దృశ్యమూ చూడాలేకాని వర్ణించ నలవికాదు.

"నీ దేవుడి దగ్గరకు ఈ బాటను వేసినది మానవులే సుమా!" అన్నాడు కమలాకరం నవ్వుతూ. కుముదిని కలవరపాటుతో అతడి దెస తిరిగి "అంత అహంభావం తగదు. మీకు పుణ్యముంటుంది. '[illegible]' అంటూనే వుంది.

టాక్సీ ఒక మలుపులో సూటిగాపోయి కొండను గ్రుద్దేసి ఆగిపోయింది. కుముదిని గుండె దడదడ లాడిపోయింది. ఆ కుదుపుకు ఎదరి సీటుకు గ్రుద్దుకున్న కమలాకరం నుదుటిపై వెంటనె రూపాయంత మొప్పి కట్టింది.

“అడడా ! డాష్ యిచ్చేసిందిసార్ !” గోలపెడ్తూ దిగాడు డ్రైవర్. కొండ ఎక్కుతూన్న, దిగుతూన్న కార్లు, బస్సులూ ఆపి డ్రైవర్లు దిగివచ్చారు. నిముషంలో వందలాది జనం ప్రోగై పోయారు. కాని ఆశ్చర్యం ! కారుకు ఒక్క లైటు కూడా పోలేదు. చెక్కు చెదరకుండానిల్చివుంది కారు! ఒక్క నొక్కుకూడా పడలేదు. స్టార్టు చేసి చూస్తే యింజను కూడా బాగానే వుంది.

“మ్రొక్కు చెల్లించలేదేమో !”

“ఏదో అపరాధం జరిగివుండాలి.”

“స్వామి బాగా కాశాడు. అదృష్టవంతులే.” ఎవరికి తోచినది వారనసాగారు చేరినజనం.

“స్వామీ మీరు నమ్మనుండాల... దేవుడు కొండ మీద మీరు అట్టమాట్లాడకూడదు. అట్లైతే నేను బండి కట్టలేను. ఆ లచ్చిమితల్లివల్ల భగవంతుడు మనల్ని కాశాడు,” అంటూ గొడవపెట్టేడు డ్రైవరు.

అందరూ “ఏమిటేమి”టని అడిగారు. డ్రైవరు వివరించాడు.

“అంత నమ్మకంలేని వాళ్లు కొండకెందుకొచ్చారు ?

"దేవుడు మహిమ జూపాడు!" మళ్ళీ రిమార్కు మొదలు_

"పోనీవోయ్," విసుగ్గా అరిచాడు కమలాకరం. ఇహా భరించలేక డ్రైవరు మీద "నడపడంరాక వంకలుపెట్టు" తీవ్రంగా అన్నాడు. పాపం, డ్రయివర్ మెత్తటి వాడేమో, మారుమాటాడకుండా కారు పోనిచ్చాడు. భయంతో, కలవరపాటులో కుముదిని తల్లడిల్లిపోయింది. భర్తను మాటాడిస్తే యేమంటాడోననే భయంతో మరో దిక్కుకు చూస్తూ కూర్చుంది. కాని కమలాకరం అహంకార స్వభావం అతడి నోటిని ఊరుకోనివ్వలేదు. "చూశావా నీ దేవుడిచ్చిన బహుమతి?" అన్నాడు నుదుటిపై బొప్పికట్టినచోట సవరించుకొంటూ. "నీ దేవుడిని ఏం కోరుకొన్నావు? కన్పించాడా? విన్నాడా నీ మాటలు?" అన్నాడు తిరిగి హేళనగా.

కుముదిని ఆవేశం పట్టలేకపోయింది. "ఈ నా సిక్తుడిపై ఆగ్రహించి నువ్వే బాగుచెయ్యాలి. తిరిగి జంటగా వచ్చి దర్శనం చేసుకొంటామని ప్రార్థించాను."

కమలాకరం పెంకెతనం పేట్రేగిపోయింది. "జంటగా కాదు సరికదా, ఇక ఒంటిగా రావడం కూడా అసంభవమే. గుర్తుంచుకో."

5

పద్మా, కుముదినీ ఒకరినొకరు చూచుకొని పరమానంద పడిపోయారు. పద్మవివాహం, కుముదిని వివాహం ఒక్కసారే జరిగాయి. ఆ యిద్దరూ యింతకుముందు కలసివుంది చాలా తక్కువే అయినా, యిద్దరూ సహృదయులవ్వడంవల్ల అతి సన్నిహితులై పోయారు. ఇద్దరూ దూరదూరంగా వున్నా ఆ సన్నిహితత్వం ఉత్తరాలద్వారా మరింత గట్టిబడాలి. ఇప్పుడు యిద్దరూ తిరిగి కలియడంతో మమతలు పెల్లుబికాయి.

"ఎప్పుడెప్పుడని ఎదురుచూస్తున్నాను వదినా. ఈ నెల్లాళ్ళనుంచీ ఏమీ తోచడం లేదు. ప్రయాణం కులాసాగా జరిగిందా?" అని పలుకరించింది పద్మ మందహాస వదనంతో.

"మీకోసం నాకూ అలానే తహతహగా వుంది వదినా మీతో యెన్నో చెప్పాలని యెన్నాళ్ళనుంచో యెదురు చూస్తున్నాను" అంది కుముదిని.

"ఎన్నాళ్ళనుండీ? మన పెళ్ళిళ్ళై మూడుగెలలైంది ప్పటికి. అంతేగా?" నవ్వింది పద్మ.

"నిజమే, కానిమూడేళ్ళయినట్లుంది మిమ్మల్ని చూచి" ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఇంకానయం. నువ్వు శ్రావణమాసం నోములకు

పుట్టింటికి వెళ్ళిపోతావేమో, నాకు తోడు వుండవనుకొ న్నాను. సరదాగా యిద్దరం యిక్కడే నోముకోవచ్చు." తిరిగి అంది పద్మ.

కుముదిని సమాధానం చెప్పేలోగా అటువచ్చిన సావిత్రి కలుగ చేసుకొంది. "ఆవిడకు పూజలెందుకూ ఎమ్మే పాసైన దొరసానికీ నీకూ నాకూను ఆచాదస్తాలన్నీ!" అంటూ వెళ్ళిపోయింది.

కుముదినికి కళ్ళనీళ్ళ పర్యంతమైంది. పద్మ జాలిపడింది వదిననుచూసి.

"బాధపడకు వదినా, అమ్మ ధోరణే అంత. అయినా నువ్వు నిష్ఠగా పూజచేస్తావుకదా ప్రతిరోజూ ?" కొంత ఆశ్చ ర్యంగానే ప్రశ్నించింది పద్మ.

కళ్ళు తుడుచుకుంది కుముదిని "మరి మీ అమ్మగారు చెప్పలేదా ?"

"వూహూ. ఏమైనా విశేషమా ?"

"విశేషమే" నిర్లిప్తంగా జవాబిచ్చింది కుముదిని. "నా బ్రతుకే విశేషంగావుంది. మీ అన్నయ్య ఎంతో సహృదయు లని విని వివాహం ముందు ఎన్ని వూహించానో ! నేనూ బాగానే చదువుకొన్నాను. మా జీవితం ఎలాగెలాగో వుంటుం దని కలలు కన్నాను. కాని ఆరంభంలోనే నిరాశ యెదురైంది. అసలీయింటి కోడలినై వచ్చినందుకే మీ అమ్మగారికి కోపం. ఇక నా ప్రవర్తనను విమర్శించడమే మీ అన్నగారి ధ్యేయం.

ఇద్దరి మధ్యా అనుక్షణం నలిగిపోతున్నాను వదినా. ఇది పైనుండి చూచేవారికి ప్రత్యేకంగా కన్పించవు అనుభవించేవాళ్లకు మాత్రం ఏమిటో వూపిరి సలపనంత బాధగా వుంటుంది !"

"అయితే అన్నయ్య నిన్ను పూజలు మానెయ్యమన్నాడన్న మాట?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది పద్మ. కుముదిని మాట్లాడలేదు.

"అన్నయ్య యింత కఠినంగా యెప్పుడు మారిపోయాడు ? తనకిష్టం లేనంత మాత్రాన నిచేత మాన్పించటమేమిటి?" అప్పటికీ కుముదిని మాట్లాడలేకపోయింది.

శ్రావణ మంగళవారం. నోములకు కావలసినవస్తు బజారునుండి తెప్పించేందుకు పట్టిక తయారు చేస్తుంది సావిత్రి.

"తెల్లవారుఝామునే లేచి స్నానంచేసి పూజ చేసేసుకొందాం వదినా, అలాగయితే అన్నయ్యకు తెలియదుగా?" అంది పద్మ రహస్యంగా కుముదినితో.

"ఎందుకులెండి అంత చాటుబ్రతుకు, అన్నయ్యకిష్టమైనప్పుడే చేస్తాను. అంతవరకు నా హృదయంలోనే ప్రతిష్టించి మనో పుష్పంతోనే పూజిస్తాను."

జాలిగా నవ్వింది పద్మ.

"చాలామంది పురుషులిలాగే వుంటారు వదినా, అలాగే అనేక దాపరికాలుంటాయి పంతంపట్టడంకంటె చాటుమాటుగా మనమే నెట్టుకు పోవాలికాని వాళ్లు మారరు."

అయిష్టంగా నవ్వి వూరుకొంది కుముదిని. పద్మ మరి మాటాడలేదు. మంగళవారం వుదయమంతా కుముదిని తీవ్రమైన అశాంతికి బాధపడింది. రోజూ పూజలు చేయని వారు కూడా యిటువంటి ప్రత్యేకమైన నోములు, పర్వదినాలు శ్రద్ధగా చేస్తారు. అనుదినం, చిరుతప్రాయం నుండీ దైవాన్ని పూజిస్తున్న తనకు మాత్రం చతుర్వర్ణాల స్త్రీలు సౌభాగ్యత్వం కోసం చేసే ఆ పూజ. నూతన పరిణీతలందరూ నోచే మంగళప్రదమైన ఆనోము చేసుకొనే అదృష్టం లేకపోయింది.

భార్య వదనంలోని అశాంతి రేఖలను కమలాకరం గుర్తించాడు కాని పట్టించుకోలేదు. లోలోన గర్వించాడేమో కూడ.

పూజ అయిన తర్వాత పద్మ పిలుపుకు బయల్దేరింది. కుముదినిని కూడా రమ్మంటే రాలేనన్నది. బలవంతం చెయ్యలేదు. సాయంకాలం అమ్మేసరికి ముత్తయిదువుల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

"నువ్వు నోచుకోలేదేమమ్మా ? అత్తగారు వద్దన్నదా?"

"అయితే పుట్టింటికెందుకు వెళ్లలేదు నోములకు ?"

కుముదినిపై కురిసిన ప్రశ్నల పరంపరకు చిరునవ్వే సమాధానమైంది.

కాని ఆ యింగిత జ్ఞానం అందరికీ వుండదు. కోడల్ని చిన్నబుచ్చటమే ఆనందమైన సావిత్రికి యింటిగుట్టు బయట పెడుతున్నాననే జ్ఞానం లేకపోయింది. దానితో యిల్లాల్ల సంభాషణ ధోరణి క్రొత్త దోవలు త్రొక్కింది.

"భర్త క్షేమం కోరవలసినది భార్య మగవాడితో పంతా లేమిటి?"

అయినా చదువుకున్న ఆడవాళ్ళకు పూజలూ పునస్కారాలూ చేసే వోపిక ఎక్కడ? నమ్మకమూ వుండదు."

భరించలేక యిక అక్కడ నిలువలేక త్వరత్వరగా మేడ మీదికి వెళ్ళిపోయింది కుముదిని.

రంగు రంగుల విలువైన దుస్తులతో నిండుగా అలంకరించుకొని వీధులవెంట తిరుగుతూన్న పేరంటాండ్రతో పట్నానికే కళవచ్చింది. అసూయవల్లనేమో మేఘావృతమైయున్న ఆకాశము మధ్యమధ్య ఒక్కొక్కమ్మడిగా వర్షించి ఆగిపోతున్నది. అయినా ఆ అసూయా జల్లులు పేరంటాని కేమాత్రం ఆటంకం తే లేకపోతున్నాయి.

డాబామీద కూర్చుని ఆ సందడంతా తిలకిస్తూన్న కమలాకరం సవ్వడివిని వెనుదిరిగి చూచాడు. "ఏమిటని ప్రశ్నించ బోయిన వాడల్లా ఆగిపోయాడు. కుముదిని నేత్రాలు శ్రావణ మేఘాలతో పోటీ పడబోతున్నట్లున్నాయి. కమలాకరం దృష్టి తనపై పడిందని తెలుసుకున్న కుముదిని వెళ్ళి డాబా పిట్టగోడ

(సు]

నానుకు నిల్చుంది. ఎందుకో కమలాకరం మనస్సు జాలితో నిండింది కుముదినిని చూస్తుంటే. నా నమ్మకాలను ఆమెపై రుద్ది బాధించడం న్యాయమా? ఆలోచించుకొంటూ కుముదిని దగ్గరకు నడవబోయి పద్మ రావడంతో ఆగిపోయాడు.

తిన్నగా వదిన దగ్గరకెళ్ళి భుజంపై చెయ్యివేసింది పద్మ.

"మూర్ఖులు అనేకం అనుకొంటారు. లెక్క జేసుకోకు వదినా."

కుముదిని మాటాడలేదు.

"మనల్ని చాలామంది పిల్చారు, పేరంటానికి వెళ్దాం రావదినా!"

"మీరు వెళ్ళండి. నే నెక్కడికీ రాలేను."

"అందరిళ్ళకీ వద్దులే. నా స్నేహితులు నలుగురున్నారు. వాళ్ళయిళ్ళకే వెళదాం. చాలా మంచివాళ్ళు."

"నేను పిలువకుండా వాళ్ళయిళ్ళకు మాత్రం యే ముఖంతో వెళ్ళను? నాకు నోములనవసరమైనప్పుడు వారి నోములతో నాకేం పని?"

"పేరంటం మంగళ చిహ్నం కదా వదినా?"

కుముదిని సమాధానమీయలేదు. కమలాకరం కల్పించుకున్నాడు—

"నువ్వు వెళ్ళు పద్మా. బలవంతం దేనికి? అయినా యేదో విధంగా మానెత్తిన ఖర్చు రుద్దదామని కాని, మీరు పూజలవీ చేయనంత మాత్రాన మొగనాళ్లు చచ్చిపోరు."

ఆ ముందు క్షణంలోనే కుముదినిపై కల్గిన జాలి అంతా ఎగిరి

పోయింది. కుముదినీ, పద్మా కూడా ఉలిక్కి పడ్డారు. కొద్ది క్షణాలపాటు ఎవ్వరూ కూడా మాటాడలేక పోయారు.

"పెళ్ళయితే నీలో మార్పు వస్తుందనుకొన్నాను. చూడగా వదిన వచ్చాక మరీ కఠినుడవై పోయినట్లు తోస్తున్న దన్నయ్యా" మెల్లగా వెళ్ళిపోయింది పద్మ.

అదృశ్యంగా తమ మధ్య పరచుకొన్న తెరలు మరీ దృఢ పడిపోతున్నట్లు లోలోపల భయం చెలరేగింది కుముదినికి. ఇంచుమించు కమలాకరం మనఃస్థితీ అదే విధంగా వుంది.

"ఇంటింటికీ వెళ్ళి సెనగలు మోసుకొస్తే భర్తల ఆయుఃప్రమాణం ఎక్కువైపోతుం దనుకొంటారు. మూర్ఖులు వాళ్ళే నేం చూస్తావుకాని పద సినిమాకెళదాం."

"ఇప్పుడు సినిమాకా? అత్తగారేమంటారు? కలవరంగా ప్రశ్నించింది.

"ఊఁ. ప్రతిదానికీ అత్తగారు, మామగారు కుర్రాళ్ళు గనుక వెళ్ళారనుకొంటారు. ఏమనుకొంటారు?" తీవ్రంగా అన్నాడు.

మౌనంగా అనుసరించింది కుముదిని.

6

సాయంత్రం మూడుగంటలవేళ పద్మా, కుముదినీ చదరంగం ఆడుకొంటున్నారు. కొంతసేపు అటుబుర్ర ఇటుబుర్ర అయ్యాక "వదినా, మిమ్మల్నొక సంగతి అడుగుదామను

కొంటున్నాను. చెప్పగలరా ?" అంది కుముదిని ఆట ఆపుజేసి.

"అడుగు వదినా, దానికేం," ఆశ్చర్యంగా చూచింది పద్మ.

"మీ అన్నయ్య మరీ యింత హిరణ్యకశిపుడిలా దైవ విరోధి అయిపోవటానికి కారణమేమిటో తెల్సుకోవాలనుంది"

నవ్వింది పద్మ. "వాడు పుట్టుకతోనే అంత. కారణాలేమీ లేవు."

కుముదిని ముఖం చిన్నబోయింది.

"నేనంత మూర్ఖురాల్ని కాను వదినా, ఇటువంటి ఆస్తికత్వంగల కుటుంబంలో పుట్టుకతోనే నాస్తికులు జన్మించరు. ఏవో గట్టి కారణాలు మీ అన్నయ్యనలా మార్చి వేశాయని నా వూహా. వూహేమిటి? గట్టినమ్మకం కూడాను. అసలు నమ్మకం లేనివాళ్ళు మరొకర్ని కూడా నమ్మవద్దని అనరు. చూచీ చూడనట్టూరుకొంటారు. పెద్ద కారణాలుండబట్టే మరీ అంత నిరంకుశత్వంగా ప్రవర్తించ గల్గుతున్నారు.

పద్మ మాట్లాడలేదు.

"పోనీండి చెప్పవద్దు. నేనూ ఈ కుటుంబంలో ఒకతెనే కదా, తెల్సుకోవచ్చని అడిగాను. అర్హతవుందనుకొన్నాను. కారణం తెలిస్తే ఆయనను మార్చగలనేమో ననుకున్నాను" నిష్టూరమాడ్తూ లేచివెళ్ళిపోతున్న కుముదినిని చెయ్యి పట్టుకు ఆపుచేసింది పద్మ.

"చెప్తాను వదినా. కాని నీమనస్సులోనే వుంచుకోవాలి. అన్నయ్యదగ్గరఎక్కడా మాటజారకూడదు. ముఖ్యంగా ఎవరిపయినా కోపం, అసూయా తెచ్చుకోకూడదు."

"నే నటువంటి దానను కాను. కారణం తెలిస్తే సులువుగా మార్చవచ్చునని ఆశ అంతే.

కొంచంసేపు తటపటాయించి కడకు చెప్పింది పద్మ. "మొదట్లో అన్నయ్య కూడ మనలాగే వుండేవాడు. ప్రతి పనికీ ముందు దేవుడిని తలచుకొనేవాడు ఎంతో భక్తి విశ్వాసాలతో ఆరాధించేవాడు. అటువంటి అన్నయ్య కడకిలాగై పోవడానికి కారణం లేకపోలేదు." కొంచంసేపు ఆగి తిరిగి మొదలెట్టింది. "వాడు బి. ఏ. చదువుతూండగా ఒక సంగతి జరిగింది. "కమల అనే అమ్మాయికి ఎవరో ఉత్తరం వ్రాశారు. కాని అది అన్నయ్య పేరుతోవుంది. వెనుకముందులాలోచించకుండా ప్రిన్సిపాల్ అన్నయ్యను సస్పెండు చేశాడు. అందరూ నమ్మినదే నాన్నగారూ నమ్మి అన్నయ్య నవమానించితే యిల్లువిడిచి వెళ్ళిపోయాడు తర్వాత తెలిసింది ఆ ఉత్తరం వ్రాసినవాడు ఒక జమీందారు కొడుకని; కాని ఏంప్రయోజనం? అన్నయ్య అసలెక్కడైనా బ్రతికున్నాడో లేదో కూడా తెలియదు. మాకు ఒక్క తమ్ముడుండేవాడు. వాడు అన్నయ్య మీద బెంగతోనే చచ్చిపోయాడు. వెతకగా వెతకగా రెండేళ్ళకు అన్నాంటీ హోటల్లో పనిచేస్తున్నాడని తెలిసి రెక్కలు కట్టుకు ఎగిరి వెళ్ళారు నాన్నగారు. ఎంత బ్రతిమలాడినా రాలేదట. ఇక ఆవూరు ముఖం చూడనన్నా

డట. అందుకని కాపురం యీ వూరు మార్చేసి వచ్చి, బ్రతిమాలి కడకు అన్నయ్యను యింటికి తీసుకురాగలిగారు. కాని వాడిలో పేరుకుపోయిన భగవద్ద్వేషాన్ని మాత్రం తొలగించలేక పోయారు. దేవుడేవుంటే ఈ అన్యాయాన్ని అడ్డలేదేమనేవాడు. నిష్కారణంగా నాచదువు పాడైతే నేరం చేసినవాడు హాయిగా రైల్వే ఆఫీసరై కులుకుతున్నాడు. న్యాయాన్యాయ విచక్షణ జరిపేవాడుపయినవుంటే, యిదేనా ధర్మం? అని వాపోయేవాడు. అన్నయ్యేకాదు! ఆస్థితిలోవున్న యెవరైనా అలాగే అనుకొంటారేమో ?

“అన్నయ్య పరారీలో వున్నప్పుడే మా మామయ్య కూతురు శకుంతల పెళ్ళి అయిపోయింది. చిన్నప్పటినుండీ అన్నయ్యకే చేస్తామనుకొనేవారు శకుంతలని. నన్నింతగా ప్రేమించినది నాకోసం ఎదురుచూడకుండా మామయ్యనో తెల్పుకోకుండా హాయిగా మరొకడిని చేసుకొంది. ఛీ, ఆడ వాళ్ళేయింతే అని ఛీదరించుకొన్నాడు మొదట. కాని, రాను రాను పశ్చాత్తాపపడ్డాడు. వున్నాడో లేడో తెలియనివాడి కోసం ఎన్నాళ్ళు చూస్తుంది ? అయినా తలిదండ్రు లూరు కొంటారా? పోనీ అక్కడైనా సుఖంగా వుంది అంతే చాలను కొనేవాడు. కాని ఏడాది తిరగకుండానే శకుంతల భర్త చని పోయాడు అది తీరని వేదనగా పరిణమించింది. అన్నయ్యకు.

”బాబు ఆయుష్మంతుడు గనుక శకుంతలతో పెళ్ళి జరుగలేదు. ఆ పెళ్ళికి ఆటంకం కలిగించడానికే కాలేజీలో

అంత తతంగం జరిగింది. అది అవమానం కాదు; మన మంచికే అంటుంది అమ్మ. నాతో పెళ్ళిజరిగితే శకుంతలకంత కష్టం రాకపోనని అన్నయ్య వాపోతాడు. "శకుంతల జీవిత మలా నాశనమవ్వకూడదు. మళ్ళీ నేనే చేసుకొంటానని పట్టు బట్టాడు కొన్నాళ్ళు. ఎన్నో ఏడ్పులు, మొత్తుకోళ్లు అయ్యాక విధిలేక అమ్మ ఒప్పుకుంది కాని శకుంతలే తిరస్కరించింది. 'ఆడదానికి రెండో పెళ్ళి అవమానమంటూ.' ఇలా కష్టాలపై కష్టాలు తరుముకొచ్చి అన్నయ్యనంత విరక్తుడినిగా చేసేశాయి చెప్పటం ముగించి పద్మతలెత్తేసరికి కుముదిని నేత్రాలు ధారా పాతంగా వర్షిస్తున్నాయి.

"అన్నికష్టాలు, అవమానాలు భరించటం మాటలు కాదు వదినా. నీకా అన్నయ్య నాస్తికత్వానికే కోపగించు కొన్నాను. కాని, దాని వెనుక యింత కఠినగాథ వుందని వూహించనైనా లేకపోయాను." కళ్లుతుడుచుకొంది కుము దిని.

"ఏదో విధంగా అన్నయ్య తిరిగి మారతాడనే నా నమ్మకం. నువ్వు తొందర పడకూడదు వదినా. ఇది నీఓర్పుకు పరీక్ష. ఆ ఒక్క విషయంలో మినహా అన్నయ్య యెంతో సద్గుణవంతుడు."

"నిజమే."

"అసలు పెళ్ళివద్దని భీష్మించుకొన్నవాడు, నిన్న చూడగానే అంగీకరించాడు. అందుకే నీపయి అంత యిష్టం లేకపోయినా అన్నయ్య పెళ్ళి చేసుకొంటేచాలని ఒప్పుకొంది

అమ్మ. నిన్నింతగా యిష్టపడి చేసుకొన్నవాడు ఎప్పుడో ఒకప్పుడు నీ మార్గంలోకి రాకపోడు."

కమలాకరం హడావుడిగా ప్రవేశించడంతో సంభాషణ ఆగిపోయింది. "కుముదా! ఢిల్లీ ఉద్యోగానికి యింటర్వ్యూ వచ్చింది. త్వరగా పెట్టె సర్దు. రేపుదయం ఏడుగంటలకు బయల్దేరతాను. పద్మా, నువ్వు బెడ్డింగు సర్దవే. నేనలా బజారుకెళ్ళి వస్తాను." వచ్చినంత హడావుడిగా నిష్క్రమించాడు.

కుముదిని హృదయం ఆనందంతో నాట్యం చేసింది. "దైవ కృపవల్ల యీ ఉద్యోగమైతే ఎవరి ప్రమేయం లేకుండా ఢిల్లీలో యిద్దరం స్వతంత్రంగా వుండొచ్చు. ఇలా అడుగడుగునా ఎవరేమనుకుంటారోనని అణగిమణగి వుండనక్కర్లేదు. స్వేచ్ఛా వాతావరణంలో భర్తను మార్చుకొనే అవకాశాలు కూడా వుంటాయి." అని వుత్సాహంగా, ఆశాజనకంగా తలపోస్తూ భగవంతుడిని మనస్సులోనే ప్రార్థించుకుంది_కమలాకరం చేయబోతున్న యీ ప్రయాణాన్ని ప్రయోజనకరం చేయమని.

కోటి ఆశలతో కోర్కెలతో భర్త ప్రయాణానికి కావలసినవన్నీ రాత్రి ప్రొద్దుపోయేవరకు సరుస్తూ, అవే ఆలోచనలతో పడుకున్న కుముదిని అర్ధరాత్రివేళ కెవ్వున అరుస్తూ లేచి కూర్చుంది. "ఏమిటంటూ కమలాకరం ఖంగారుగా దగ్గరకు వెళ్ళాడు. గజగజ వణికిపోతుందే కాని మాట్లాడలేకపోయింది కుముదిని. కొంతసేపటికి తేరుకున్నాక

"నోటితో అది చెప్పలేను. యేదో పీడకల, మీరు మాత్రం యీ ప్రయాణం చేయొద్దు. ఉద్యోగం సంగతి దేవుడెరుగు." అంది కమలాకరాన్ని గట్టిగా పట్టుకొని.

విస్తుపోతూ చూశాడు కమలాకరం. "నీకింకా పూర్తిగా మెలకువచ్చినట్లు లేదు. పడుకో, మాట్లాడక"

"కాదు తెలిసే మాటాడుతున్నాను. నామాట త్రోసెయ్యకండి." కన్నీళ్ళు బొటబొటా కారిపోతున్నాయి, కుముదిని నేత్రాలనుండి.

"వుష్. పడుకోమంటూంటే, అర్ధరాత్రి లేచి ఏమిటీ గొడవ?" విసుక్కుంటూ అటు తిరిగి పడుకున్నాడు.

కుముదిని మరి మాటాడలేదు. కాని యిక ఆ రాత్రంతా ఆమెకు నిద్రపట్టలేదు. భయంకరమైన ఆలోచనలనుండి తప్పించుకోవటానికి యేదో పత్రిక తిరగేస్తూ జాగారం చేసింది.

ఉదయమే లేచి ప్రయాణానికి సిద్ధమౌతున్న భర్తను కొంచంసేపు చూచి, మాటాడే ధైర్యంలేక అత్తగారి దగ్గరకు పరుగెట్టింది. కాఫీ కలుపుతున్న సావిత్రి "ఏమి?"న్నట్లు తలెత్తి చూచింది.

"ఈ ప్రయాణం వద్దని చెప్పండి. నాకేమిటో రాత్రి భయంకరమైన కల వచ్చింది. చుట్టూ శవాలమధ్యన ఆయన రక్తంతో తడిచివున్న బట్టలతో భయంకరంగా నవ్వుతున్నట్లు ఎవరో ఏడుస్తున్నట్లూ అబ్బా చెప్పలేను, వెళ్ళండి అత్తయ్యా

చెప్పండి." అంది. ఎప్పుడూ ధైర్యంగా నిండుదనం తొణికిస లాడుతూండే కోడలు అలా వెక్కి-వెక్కి పడి ఏడుస్తూంటే సావిత్రి ఖంగారుపడి పోయింది. అందులోనూ కుముదిని వర్ణించిన స్వప్నదృశ్యం వినడంతో ఆమెకూ మనస్సులో కలవరం బయల్దేరింది. "పద్మా అన్నయ్యనిలా పిలువు" అని ఫర్మాయించింది.

కమలాకరం వచ్చాడు. వస్తూనే ఒక్కసారి కుముదినినీ, సావిత్రినీ పరీక్షగా చూచి "ఏం? ఈవిడగారేమైనా రాయబారం చేయమన్నదా నిన్ను! చాల్లే! తేరికూర్చుని మీరుకనే కలలన్నీ నమ్ముకుంటే యిక పనులయినట్లే." అన్నాడు కోపంగా.

"ఇంకా మాట వినకుండానే అలా మండిపడతావేం ఖర్మ? నాకూ ఏమిటో అపశకునాలు తోస్తున్నాయి. లేచీ లేవడంతోనే పిల్లి ఎదురైందీవేళ. కుముదినికేదో కలవచ్చిందట. ఒకటే ఏడుస్తూంది. నామాటవిని ఈ ప్రయాణం మానేయి నాయనా. ఇదివరకెప్పుడైనా యిలా అడ్డుపెట్టానా చెప్పు?"

ఉగ్రుడైపోయాడు కమలాకరం. "నేనెంతో వుత్సాహంగా వెళ్తుంటే ఏమిటీ ఆటంకాలు? ఈ గుడ్డినమ్మకాలూ, పిచ్చిదేవుళ్ళ మహిమలూ నాదగ్గరకాదు. నేను వెళ్ళి తీరాను. అవకాశాలొచ్చేదే బహుతక్కువ! వాటిని నాశనం చేసుకొనే మూర్ఖుడిని కాదు నేను" అంటూనే అక్కడినుండి చకచకా వెళ్ళిపోయాడు.

"ఏంచేస్తాంమరి? చెప్పిన మాట విననివాడితో! అన్నిటికి ఆ ఏడుకొండల వాడే వున్నాడు. వెళ్ళి ఏంకావాలో చూడు" అంటూ కోపల్ని పిదాచ్చింది సావిత్రి.

భగవంతుడిపై భారంవేసి హృదయం శాంతపరచుకొంది కమలిని. కాఫీ తీసుకువెళ్ళి భర్తకందించి మౌనంగా అక్కడే నిల్చుంది. కాని, లోపల మహాభారత సంగ్రామం జరుగుతోంది భావాలకు. తిరుపతి ప్రయాణంలోనే నీ మహిమంతా జూపావు. కాని పిల్లలు పోతకడితే మాత్రం, తండ్రివి అగ్రహించడం తగునా స్వామీ? నీకంతగా ఆపరాని ఆగ్రహమే కలిగితే నన్ను తీసుకుపో, నిత్యం నీ చరణారవిందపూజ సల్పుతాను. మరుజన్మలోనైనా నా మనస్సునిచ్చే భర్తననుగ్రహిస్తువుగాని. కాని నా మాంగల్యాన్ని నశింపజేసి నా జీవితాన్ని నరకం మాత్రం చేయవద్దు: ఏడుకొండలవాడా, వెంకటరమణా ఇదే నా కోరిక. ఇంకెప్పుడూ నిన్నేమీ కోరను" నిర్మల హృదయంతో దైవప్రార్థన చేసుకొన్నాక బాధా హృదయం తేలికపడింది. అప్పుడామె ముఖంలో ఏభావమూ వ్యక్తము కావడంలేదు. ఆ ప్రశాంతవదనం చూడగా కమలాకరం మదిలో కోపం అంతరించి ప్రేమాభిమానాలు నిండిపోసాగాయి. వెళ్ళవద్దన్నందుకే కోపగించుకొన్నాను కాని రాత్రింబవళ్ళు ఆమె ధ్యాసంతా నా యోగక్షేమాల పైననే కదా! అనుకొన్న అతడి హృదయం గర్వంతో, వాత్సల్యంతో పరవళ్ళు త్రొక్కింది.

"నాకింతలోనే యేమీ అయిపోదులే కుముదినీ, భయపడకు. దేవుళ్ళు, దెయ్యాలసంగతలావున్నా అనునిత్యం నీ ప్రసన్న హృదయం వేయి కండ్లతో నా చుట్టూ పరిభ్రమిస్తుంటే నీ పరిధి దాటి నేనెక్కడికిపోతాను? నీ ప్రేమ నాకు వెయ్యి ఏనుగుల బలం" అన్నాడు ప్రసన్నవదనంతో, మార్ధవకంఠంతో.

కుముదినీదేవి కండ్లు ఆనందంతో విచిత్రంగా మెరిశాయి. పెళ్ళయిన తర్వాత యీ మూడు నెలల్లోనూ అటువంటి ప్రేమాస్పదమైన మాటలు ఎన్నడూ భర్త నోటినుండి వెలువడలేదు. సందేహంలేదు, అతడిలో మార్పు వస్తోందనడానికిది ప్రథమ చిహ్నం. మనసులోనే అంజలి ఘటించింది కృపామూర్తియైన ఆ సర్వేశ్వరుడికి.

వెళ్ళేముందు "ఢిల్లీనుంచి యేం తెమ్మంటారు?" అనడిగాడు కమలాకరం చెల్లెల్ని, భార్యనూ.

"నాకు మంచి ముత్యాల దుద్దులు తెచ్చిపెట్టన్నయ్యా. ఏదైనా ఒక సిల్కుచీర" నవ్వుతూ, సర్దాగా చెప్పింది పద్మ.

"అలాగే, మరి తమరికో శ్రీమతీజీ?" హాస్యంగా భార్యవైపు తిరిగాడు.

నవ్వింది కుముదిని. "క్షేమంగా లాభంగా తిరిగిరండి"

"ఆల్ రైట్, అదిసరే, ఫలానా వస్తువని చెప్పు. తీసుకొస్తాను."

"మీ యిష్టం. మీకేదిస్తోస్తే అది" రాత్రి పీడకల

మనస్సులో మెదుల్తుండగా పరధ్యానంగా జవాబిచ్చింది కుముదిని.

నవ్వుతూన్న కమలాకరం ముఖంలో అప్రసన్న మేఘాలు ఆవరించాయి. "నీ యిష్టం-నీయిష్టం అనకపోతే నీవు తెచ్చిన వక్కర్లేదని చెప్పరాదూ? ఛీ" చికాకుపడుతూ వెళ్ళిపోయాడు. ఆ చికాకులో యింకెవరితోనూ యేమీ మాట్లాడలేదు. రైలు ఎక్కుతూంటే తండ్రి అడిగాడు మళ్ళీ ఎప్పుడొస్తావురా?

"శనివారం మెయిలెక్కుతాను మళ్ళీ" ముక్తసరిగా చెప్పి వెళ్ళిపోయాడు.

తప్పనిసరిగా నవ్వుముఖంతో సాగనంపిందే కాని అతడు వెళ్ళిన దగ్గరనుంచీ కుముదిని హృదయం ఆరాటంతో బాధపడసాగింది. ఎంత సరిపెట్టుకోజూచినా వైవిధ్య భావాలు ఆమె హృదయాన్ని మథించి వేస్తున్నాయి. ఇటీవల తన విషయంలో అత్తగారికి యేర్పడిన సద్భావంగాని ఆడపడుచు సహృదయతగాని ఆమెకు శాంతిని చేకూర్చలేక పోయాయి. అలాగే అయిదు రోజులు గడచి పోయాయి- క్షేమంగా చేరాననీ, ఇంటర్వ్యూ బాగా జరిగిందనీ, ఆరోజూ, మర్నాడూ నగరమంతా చూచి బయల్దేరుతాననీ తండ్రిపేర వుత్తరం వ్రాశాడు కమలాకరం.

"అయితే ఈపాటికి రైలెక్కి వుంటారు" అనుకొంది కుముదిని. "నాపై కోపం తగ్గలేదు. కాబోలు! పోనీ

క్షేమంగా వుంటే అంతే చాలు" అని సరిపెట్టుకుంది. భర్త తనకు లెటరు వ్రాయకపోవటం గూర్చి.

శనివారం రాత్రి పడుకొన్నదే కాని ఒక్క క్షణం కూడా నిద్రపోలేదు. ఏదో కలవరపాటు ఊపివేయగా ఎందుకో తెలియని దుఃఖం పెల్లుబికింది. రాత్రంతా యిష్టదైవమైన ఆ కళ్యాణ వేంకటేశ్వరుని జపిస్తూనే వుంది.

ఆదివారం ఉదయం నిద్ర లేస్తూనే ఏమిటో అశాంతిగా అల్లకల్లోలంగా వుంది కుముదినీదేవి మనస్సు. భర్త చెప్పినట్లు యేం నమ్మకమూ లేకపోతేనే మనశ్శాంతి ఎక్కువగా వుంటుందేమో! లేకుంటే ఏదో కలరావడమేమిటి. తాను దానిని మూఢంగా భర్త జీవితాన్ని కన్వయించుకు బాధపడడమేమిటి? "నిజంగా మూర్ఖత్వము! ఎంత చదువు చదివినా పాత సాంప్రదాయాలలో పెరిగినందువల్ల యిలాగున్నాను!" తన అర్థంలేని ఆలోచనలకు, ఆందోళనకు తానే లోలోన నవ్వుకుంటూ ముఖం కడుక్కు స్నానం చేసింది. అయినా ఎంత సరిపెట్టుకుందామన్నా అంతరంగాన చెలరేగుతున్న ఆ అవ్యక్త ఆవేదన అణగారలేదు. తల దువ్వుకుని జడవేసుకుంటూ వంటింట్లోకెళ్ళింది. అత్తగారి కేమైనా సాయం చేద్దామనే ఉద్దేశ్యంతో.

సావిత్రి పూజామందిరం దగ్గర వుంది. అప్పుడే పూజ ముగించి హారతి యిస్తోంది. కుముదిని వెళ్ళి కొద్ది దూరంలో కూర్చుని నిశ్చలంగా ఆ భగవద్విగ్రహాలను అవలోకించింది. నీరాజనం కళ్ళకద్దుకు లేవబోతూంటే సావిత్రి రెండు పూజా

పుష్పాలు తీసిచ్చింది. ఇంట్లో అందరితోను అణకువగా ప్రేమగా వుంటూన్న కోడలిపై ఆమె అకారణ కోపం అంతకంతకు తగ్గుతోంది. సావిత్రి యిచ్చిన పూజాకుసుమాలు భక్తితో అందుకుని వేళ్లో అమర్చుకుంటూ మరొక్కసారి భగవంతునికి మ్రొక్కి లేచింది కుముదిని.

రేడియో దగ్గర కూర్చుని భక్తిరంజని వింటూన్న పద్మ దగ్గరకువెళ్ళి కూర్చుంది. రేడియో వినడం మరచిపోయి కబుర్లలో పడిన యిద్దరూ హఠాత్తుగా పిడుగుపడ్డట్టు వినిపించిన వార్తతో బిగుసుకు పోయారు. భక్తిరంజని పూర్తై వార్తలెప్పుడు మొదలయ్యాయో మరి! "కడచిన రాత్రి పంజాబ్ మెయిల్ కలకత్తాకు డెబ్భైమైళ్ళ దూరంలో ఘోరప్రమాదానికి గురైంది, నాశనమైన బోగీలలో ఒక ఫస్ట్క్లాస్, రెండు సెకండ్క్లాస్ కంపార్టుమెంటులుకూడా వున్నాయి. విశేష జననష్టం..." చెవులు గళ్ళుపడ్డాయి కుముదినికి, ఇంకేమీ వినిపించలేదు. ఎదుటి వస్తువులన్నీ కళ్ళకు గిరగిర తిరిగిపోతూ అయోమయమై పోయాయి. లోకమంతా అంధకారంగా కన్పించింది. కనులు చీకట్లు క్రమ్మి నేలకొరిగింది.

"మర్నాడు సాయంత్రం నీరసంగా కనులు తెరువబోయిన కుముదినీదేవి చెవులకు ముందు కమలాకరం మూర్తే దర్శనమిచ్చింది" అనేకంటే కమలాకరం పిలుపుకే కుముదినికి స్పృహ వచ్చిందంటే న్యాయంగా వుంటుంది. ఏవో లోకాలలోనో ఎగురుతూన్న ఆత్మకమలాకరం కంఠస్వరం విని, దిగి వచ్చి, శరీరాన్ని ప్రవేశించిందనడం సబబుగా వుంటుంది.

అంతా అయోమయంగా వుంది! భర్త, ఆడపడచు, అత్తమామలు, తల్లిదండ్రులు అందరూ తనచుట్టూ చేరి వున్నారు. ఆత్రం వ్యక్తపరుస్తూ, అందరి ముఖాలు పడ్చిపడ్చి మలినమైనట్లే వున్నాయి. మెల్లగా గుర్తుకు రాసాగింది కుముదినికి. హౌరామెయిల్ ... శనివారం రాత్రి ... ప్రమాదం ...

"మీరు వచ్చారా మీరు??" పరిసరాలు కూడ గమనించకుండా భర్త రెండుచేతులూ పట్టుకుని కన్నీరు కురిపించసాగింది.

"వచ్చాను కుముదా, వచ్చాను! చెప్పలేదా—నా మూర్తికి నీ హృదయంలో పవిత్ర ఆరాధన జరిగినంతకాలం నేనేమీ అయిపోను." అతడికికూడా కన్నీళ్లు ఆగడంలేదు.

పరిస్థితి శాంతపడ్డాక మెల్లగా అన్నీ తెలిసివచ్చాయి కుముదినికి. అర్ధరాత్రివేళ హోరున కురిసే వానలో జరిగింది ఆ ప్రమాదం. ఎదర పెట్టెలన్నీ తుక్కు-తుక్కై పోయాయి. చాలా జననష్టం జరిగింది. సరిగా ఆ వెనుక చెక్కు-చెదరక నిలిచివున్న పెట్టెలలో మొదటిదానిలో వున్నాడు కమలాకరం. పెద్దవూపుతో ఆగిపోయింది తమ భోగి. విపరీతమైన శబ్దం—హాహాకారాలు—అబ్బా వర్ణించలేక పోయాడు కమలాకరం. వింటూన్న కుముదిని వణకిపోతూ చెవులు మూసుకుంది; నిశ్శబ్దంగా రెండు అశ్రుబిందువులు వదిలింది, ప్రమాదానికి గురైన ఆ అభాగ్యులను తలంచుకుంటూ.

ఆ వెంటనే తాను క్షేమంగా వున్నట్లు యింటికి వైరిచ్చాడు కమలాకరం. కాని స్పృహ తప్పిన స్థితిలో వున్న కుము

దీనికి అదేమీ తెలియదు. ఖంగారుపడి, టెలిగ్రాం ద్వారా కుముదిని తల్లిదండ్రులను రప్పించాడు వెంకటాచలం.

“నీ సౌభాగ్యం గొప్పది. అందుకే నా కొడుకు తిరిగి వచ్చాడు” అంటూ కోడలిని ఆప్యాయంగా అక్కున జేర్చుకొంది సావిత్రి. ప్రతివారి నోటినుండీ అదేమాట. “కుముదిని పసుపుకుంకుమలు గట్టివి. మాంగల్యం మహిమగలది.” ఆ మాట వింటూ కమలాకరం హృదయం వుప్పొంగి పోయింది.

కమలాకరం క్షేమంగా తిరిగిరావడంతో కలిగిన సంతోషంతో ఆ రాత్రి యింట్లో ఎవరికీ నిద్రాహారాల ప్రసక్తి లేదు.

“మరో విధంగా జరిగితే ఏంచేద్దువు కుముదా?” ఏకాంతంలో మెల్లగా అడిగాడు కమలాకరం.

అతడి నోరుమూసింది కుముదిని. “నా విషయమూ మరో విధంగానే జరుగును. ఆ అపస్మారకస్థితి అలా శాశ్వత నిద్రగా మారును” ఇద్దరి నేత్రాలూ జలపాతాలయ్యాయి.

కొంతసేపటికి కమలాకరం చెప్పాడు. “ఎంత ఆశ్చర్యం కుముదా! మొదట ఒక సెకండ్ క్లాస్ కంపార్టుమెంటులో ఎక్కాను. కాని అందులో వాసుదేవరావని ఒక రైల్వే ఆఫీసర్ వున్నాడు. వాడు నాకు జన్మవిరోధి. నీకీ విషయాన్నెప్పుడూ చెప్పలేదు.

“కాలేజీలో వాడు నా సహాధ్యాయి.”

“చెప్పనక్కరలేదు. నాకు తెల్సులెండి.”

"తెలుసా?" ఆశ్చర్యంగా సందేహంగా అడిగాడు.

"వదిన చెప్పింది. కాని కలవరపడకండి. నాకు మీపై అనుమానం కాని, అగౌరవం కాని లేదు. ఆ విషసర్పం కారణంగా మీరు బాధపడ్డారని తెలిసి ఎంతగానో విచారించాను."

"ఊం." నిట్టూర్చాడు కమలాకరం.

"అదంతా ఒక పీడకల కుముదినీ. వాడిని చూడగానే తిరిగి అంతర్దాహం అనుభవించాను. కంపార్ట్‌మెంట్‌లో వున్న మరో యిద్దరు ప్రయాణీకులు నిద్రపోతున్నారు. 'వాడిని చంపి పారేసి నా కక్ష తీర్చుకోవటానికి యిదే మంచి అదను. ఎవరు చూడొచ్చారు?' అనిపించింది. కాని ఆ ఆవేశాన్నంతనూ ఎలా అణచుకొన్నానో నాకే తెలియదు. వెంటనే ఆగిపోయి మరో కంపార్టుమెంట్‌లో ఎక్కాను. కాని 'దొరికిన అవకాశం పోగొట్టుకుంటున్నాను,' అని బాధపడుతూనే వున్నాను. వాడు మాత్రం నన్ను గుర్తుపట్టలేదు. పొడుగునా ఆ రైల్లోనే ప్రయాణం చేశాడు.

"ఊం అయితే?" కుతూహలంగా ప్రశ్నించింది కుముదిని.

"నేను శ్రమపడకుండానే నా కక్ష తీరిపోయింది. పడిపోయిన రెండు సెకండ్ క్లాసు పెట్టెలలోను ఒకటి వాడున్నది. ఆకారంకూడా మిగలకుండా తుక్కు తుక్కు అయ్యాడు."

కుముదిని నిర్విణ్ణురాలైంది. ఏమీ మాట్లాడలేక పోయింది.

ఆ బీభత్సం చూశాక ఏమిటో మనస్సు చలించి

పోయింది. మనస్సులో కోపంపోయి అయ్యో! అన్పించింది. కాని వాడే గనుక ఆ కంపార్ట్‌మెంటులో లేకపోతే నేనందు లోనే వుందును. మళ్ళీ తిరిగి రాకపోదును"

"వాడు చేసిన తప్పుకు ఒకప్పుడు మీరు శిక్ష అనుభ వించారు. వయస్సుతో కలిసి పెరిగి పెద్దదైపోయిన ఆ కక్ష యిప్పుడు తీరినట్లుంది" నిర్లిప్తంగా అన్నది.

"అంతేనంటావా? అవును. వాడి మూలంగానే మా తమ్ముడు చచ్చిపోయాడు? వాడి మూలంగానే శకుంతల వితంతువైంది? అయినా చనిపోయేముందు ఒక్కసారి కలుసు కోవడం ఏమిటో ఆశ్చర్యంగా వుంది"

కుముదిని విని ఊరుకుంది.

"నీకెంత ప్రేమ కుముదినీ నా మీద! నా ప్రమాదం వినగానే తప్పిపోయిన స్పృహ, నా పిలుపు విని మేల్కొం డంలో నేనెంత గర్విస్తున్నానో తెలుసా? నీ ప్రేమ బలమే నన్ను బ్రతికించింది" అన్నాడు ఆవేశంగా.

నిర్జీవంగా నవ్వింది కుముదిని. "భార్యల ప్రేమలకూ, పూజలకే భర్తల ఆయుఃప్రమాణాలు పెరుగుతాయా? మీతోపాటు యింకా చాలామంది బ్రతికిపోతున్నారు. మరి చాలమంది చచ్చిపోయారు"

చెళ్ళున కొట్టినట్లయింది కమలాకరానికి. శ్రావణ మాసం నోములనీ, పేరంటాలనూ తాను అవహేళన చేయడం మనస్సులో వుంచుకునే కుముదిని ఆమాట అన్నదని

గ్రహించాడు. ఎందుకో అతడి మనస్సు చిన్నబోయింది. ఇంకేమీ మాటాడకుండా పడుకున్నాడు.

మర్నాడుదయం తాను వెళ్ళిన యింటర్వ్యూ గురించి కుముదినితో చెప్తున్నాడు కమలాకరం. "నాకు ఉద్యోగం తప్పకుండా వస్తుందనే నమ్మకం వుంది కుముదా"

"నాకూ అలానే అన్పిస్తూంది"

"వదినా?" పద్మ ప్రవేశించింది. "నేనూ, అమ్మా నాన్నగారూ ఆలయానికి వెళ్తున్నాం. పూజలూ, అభిషేకాలూ చేయించటానికి, నువ్వూ రా"

"మీరు వెళ్ళండి వదినా" కుముదిని చాల మెల్లగా అంది. పద్మ అన్నకు దగ్గరగా నడిచింది. "దేవుడే కాయక పోతే యింత ప్రమాదం గడచి బయటపడుదువా అన్నయ్యా ఇకనైనా నువ్వు ఆ అర్థంలేని పంతాలు ఒదులుకోవటం మంచిది."

కమలాకరం మాటాడకుండా చెప్పులువేసుకుని బయటకు వెళ్ళిపోయాడు. మళ్ళీ వదిన దగ్గరగా వెళ్ళింది పద్మ. ఈ సంతోష సమయంలో నువ్విలా ప్రవర్తించినా అన్నయ్యకు కోపంరాదు వదినా. అందుకే నిర్ణయాన్ని నీకే వదిలేసి అన్నయ్య అలా వెళ్ళిపోయాడు. గ్రహించలేదు నువ్వు?"

"గ్రహించాను వదినా ఆయనలో మెల్లగా మార్పు వస్తుంది. కాని అదింకాపటిష్టమై పూర్తిగా మారాలి. మొన్న తిరుపతి ఆలయంలో అలాగే మొక్కుకున్నాను, ఈ నాస్తిక భర్త తిరిగి ఆస్తికుడుగా మారినప్పుడే జంటగాదర్శనం

చేసుకొంటామని. దేవుడు నా మొర వింటాడు. నన్ను క్షమిస్తాడు అంతవరకు మనస్సులోనే ప్రార్థిస్తుంటాను. మీరంతా వెళ్లి పూజలు సక్రమంగా జరిపించి రండి" కళ్ళు ఒత్తుకుంటూ చెప్పింది కుముదిని. పద్మ వెళ్ళిపోయింది.

ఒక గంట గడిచాక తిరిగివచ్చిన కమలాకరం కుముదిని వున్నచోటే వుండడం చూచి చకితుడయ్యాడు. ఆమె ఆలయానికి వెళ్ళి వుంటుందనే దూకీ నమ్మకంతో వచ్చిన అతడికి ఆశాభంగమే అయ్యింది.

"కుముదం. ఎందు కేడుస్తున్నావు?"

"నేనా? లేదే!" కళ్లు తుడుచుకు నవ్వింది.

"ఒహో! లేదా? అయితే సరే."

మధ్యాహ్నం భోజనాలైన తర్వాత కుముదిని తల్లి తండ్రి వెళ్ళిపోయారు. కుముదిని రమ్మంటే రానన్నది. వేంకటాచలం సావిత్రికూడ వెళ్ళమన్నారు. కమలాకరం కూడా వస్తానన్నాడు. అయినా కుముదిని అంగీకరించలేదు. ఆమె ఆలోచనలేమిటో ఎవ్వరికీ అర్థమవ్వవు. ఎంతో పరధ్యాన్నంగా వుంటున్నది. ఎవ్వరికీ చెప్పదు.

"సాయంత్రం ఏదైనా సినిమా కెళ్దామన్నయ్యా? అనడిగింది పద్మ.

"అలాగే, ఏం కుముదా? వెళదామా?" అన్నాడు కమలాకరం.

"మీ ఇష్టం వెళదాం లెండి"అని చటుక్కున నాలుక కరచుకుంది. అతడు ఢిల్లీ వెళ్ళేముందు ఈ మాట గురించే

కోపం తెచ్చుకున్నాడు. ఆ విషయం ఇద్దరికీ గుర్తుకువచ్చి యిద్దరూ చెరోవిధంగా బాధపడ్డారు.

'అలా అని వుండకూడ' దనుకొంది కుముదిని.

“మాటల అర్థాలు మాట్లాడే మనుష్యుల మనస్సులను అర్థం చేసుకోవడంబట్టి కూడా వుంటుంది కుముదా!” అన్నాడు కమలాకరం నవ్వుతూ. ఆమె మాటలు తనకు కోపం తెప్పించలేదనే భావం ధ్వనింపజేస్తూ, నవ్వి ఊరుకుంది కుముదిని. ఇదివరలో యీ 'మీ ఇష్టం' అనే మాటలో ఎంతో నిర్లక్ష్యం దాగివున్నట్లు తోచి కోపంవచ్చింది కమలాకరానికి. ఆ కోపంతోనే ఢిల్లీ నుంచి యేమీ తీసుకురాలేదు. కాని యివ్వాళ 'మీ యిష్టం' అనే కుముదిని మాటలో అతడికెంతో గౌరవం, అభిమానం ద్యోతకమయ్యాయి.

సాయంత్రం “సినిమాకు టైమవుతోంది కుముదా” అంటూ లోపలకు వచ్చిన కమలాకరం యింకా కుముదిని పడుకొనే వుండటం చూచి ఆశ్చర్యపోయాడు.

“ఏం సినిమా ప్రోగ్రాం లేదా?” అని అడిగాడు.

“మీరూ, పద్మా వెళ్ళండి నాకు కొంచెం జ్వరం వచ్చినట్లుంది.”

“అరె, జ్వరమా?” ఆత్రంగా దగ్గరకెళ్ళి ముఖంపై చెయ్యివేసి చూచాడు. కొద్దిగా వేడిగా వుంది. “ఫర్వాలేదు. రేపటికి తగ్గిపోతుంది. ఏం అమ్మమీద బెంగపెట్టుకొన్నావా పాపాయి, ఆమె వెళ్ళిపోయిందని?” అని హాస్యం చేశాడు. కుముదిని కూడా చిన్నగా నవ్వి వూరుకుంది.

చాలాసేపు ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు కమలాకరం. కడకు "కుముదా ఒక్కటడగనా?" అన్నాడు.

"ఏమిటది?"

"ఏమిటో మనం దూరమైపోతున్నట్లనిపిస్తూంది. చాలా ముభావంగా వుంటున్నావు. కారణం తెలియటంలేదు. ప్రొద్దున్న ఎందుకో ఏడుస్తున్నావు. అడిగితే చెప్పలేదు.

"..............."

"నేను ప్రమాదందాటి సురక్షితంగా వచ్చినందుకెంతో సంతోషిస్తావు ఇంకా దగ్గరౌతావనుకొన్నాను. కాని మనమధ్య అగాధం అలాగే వుండిపోయింది. ఇంకా పెద్దదైనట్లుకూడా అన్పిస్తుంది. బహుశః ప్రమాదవార్త వినగానే నీవు పడ్డ 'షాక్' నుండి యింకా తేరుకోలేదనుకొంటాను."

అప్పటికీ మాట్లాడలేదు కుముదిని.

"మాటాడవేం కుముదా? నీ ప్రేమ బలంవల్ల బ్రతికి వచ్చిననాడు నీ నోటినుండి ప్రేమ వాక్కులు వినరాక పోవటం చాలా బాధగా వుంది. ఎందుకింత ముభావంగా మారి పోయావు? అమ్మ ఏమైనా అన్నదా?"

నిశ్చలంగా జవాబిచ్చింది కుముదిని. "ఎవ్వరూ ఏమీ అనలేదు. కాని మీరు మరీ యింతగా ధైర్యం కోల్పోవటమేమిటి? నేనెంత? ఎన్నో ప్రమాదాలు జరుగుతాయి. వాటిలో చాలామంది బ్రతికి బాగుంటారు. ఒక మనిషి బాగోగులకు మరొకరితో నిమిత్తమేముంది? నా ప్రేమ బలంవల్ల తిరిగి

వచ్చారో లేక ప్రయాణానికి నేను పెట్టిన అటంకం వల్లనే ప్రమాదం జరిగిందో? యేం చెప్పగలం?"

కమలాకరం మనస్సు కొంచం కించపడ్డది. ఏమీ మాట్లాడలేక పోయాడు: ఇదివరలోవలె భార్య మాటలను నిర్మొహమాటంగా ఖండించడానికి అతడు సాహసించలేదు. అతడికే తెలియని ఓ మృణాలత అతడి హృదయాన్నావరించింది. ప్రతి చిన్న విషయానికీ చికాకుపడే కటుత్వం యేమైందో మరి!

"చూడండీ," కుముదిని మెల్లగా ప్రారంభించింది. "మీ కనులముందే ఘోరప్రమాదం జరిగింది. మీతో ప్రయాణం చేస్తున్న కొందరు అలా చచ్చిపోవడం మీరు క్షేమంగా వుండడం యెలా జరిగిందంటారు? అదృష్టదురదృష్టాలనూ న్యాయాన్యాయాలను పరీక్షించి నిర్ణయించే అధికారి మనకు అగోచరమయిన సూత్రధారి ఒకడు పైన వున్నాడని ఎందుకనుకోరు? 'నీవల్ల బ్రతికాను కుముదా, నీ ప్రేమవల్ల తిరిగి వచ్చాను కుము·—ఎంతసేపూ యిదేమాట! సాధారణ మానవమాత్రురాల్ని నేనెంత: ఆ శ్రీనివాసుడిని మర్చి యి ఆయన పాదాలముందు గడ్డిపోచ మాత్రంగూడా చేయని నన్ను పొగడుతుంటే నా హృదయమెంత క్షోభిస్తుందో మీకేం తెలుసు?? ఇక ఆపుకోలేక భోరున యేడ్చేసింది.

నిశ్శబ్దంగా కుముదిని తల నిమరడంతప్ప కమలాకరం నోరు విప్పి ఒక్కమాటకూడా మాటాడలేదు. అయిదు నిముషాల కాలం అలా కూర్చుని మెల్లగా లేచి వెళ్ళిపోయాడు.

కుముదినికి ఆశ్చర్యమైంది. అనేక చిత్రవిచిత్ర కార్యాలొనర్చు తున్న మానవ మేధస్సుపైనా, విపరీత పరిణతి నొందుతున్న ఆధునిక విజ్ఞానం పైనా, మూఢమానవుల వూహాలోకంలోనే కాని యదార్థ అస్తిత్వం, ఆకృతీలేని భగవంతుడనే పదార్థం యొక్క అప్రయోజకత్వంపైనా అతడు అనర్గళంగా వుపన్యాస మిస్తాడనుకొని వూహించిన ఆమెకు ఆశాభంగమే అయింది.

మర్నాడుకూడా కుముదినికి జ్వరం తగ్గలేదు. కమలా కరం మనస్సేమీ బాగుండలేదు. ఆఫీసుకు వెళ్ళినా అతడి దృష్టి అంతా యింటిపైననే వున్నది. ముఖ్యంగా కుముదినీ దేవి ముభావతకు కారణమేమిటో తెలియక మనస్సు కొట్టు మిట్టాడి పోతోంది. ప్రయాణం ముందురోజు రాత్రి కుముదినికి వచ్చిన స్వప్నవృత్తాంతం, ప్రయాణంలో జరిగిన ప్రమాదం, ఇప్పుడు కుముదిని జ్వరం, తన చిత్తవైకల్యం – ఈ అన్నిటినీ అతడి మనస్సు సమన్వయపరచ ప్రయత్నిస్తోంది; కాని సాధ్య పడటంలేదు.

సాయంకాలం డాక్టర్ని వెంటబెట్టుకొచ్చాడు యింటికి. "ఆందోళన అనవసరం. వట్టి టెంపరేచర్" అంటూ ప్రిస్క్రిప్ షన్ చేసి మందుకు పంపించమని వెళ్ళిపోయాడు. ఆ వట్టి టెంపరేచరే వారం రోజులైనా తగ్గలేదు. డాక్టర్ మందు యిస్తూనే వున్నాడు; ఈ మాత్రమైనా తగ్గలేదు; గుణం కన్పించలేదు. పోనీ ఫలానా జబ్బని నిర్ణయించటానికింకే లక్ష ణాలూ లేవు. కేవలం శారీరకోష్ణోగ్రత, ఆరోజుకారోజు నీర

సించిపోవడం మినహా మరే మార్గం తోచలేదు. కమలాకరానికి ఇంచుమించు మతిపోయింది. కుముదిని వారించినా వినక ఆఫీసుకు సెలవు పెట్టేశాడు. ఇరవైనాలుగు గంటలూ ఆమె మంచం ప్రక్కనే గడుపుతున్నాడు.

డాక్టర్ని మార్చినా జబ్బేమిటో అంతుపట్టలేదు. నెల రోజులు తిరిగినా జబ్బేమిటో అంతుపట్టలేదు. అంతకంతకు కుముదిని వదనం కళావిహీనమై పోతోంది. ప్రక్కమీద నుంచి లేచి రెండడుగులైనా వెయ్యలేక పోతోంది. అయినా నోరు విప్పి ఫలానా బాధ అని చెప్పదు. ముక్తసరిగా ఏం లేదంటుంది. తల్లిదండ్రులకు కబురు వెళ్ళింది. వచ్చారు. తల్లితో కూడా కుముదిని ఎక్కువగా మాటాడలేదు. సావిత్రి మ్రొక్కని దైవం, చేయని పూజా లేదు. రోజూ ఏవో ముడుపులు కడుతూనే వుంది. కడకు భూతవైద్యాలు చేయించి, రక్షరేకులుకూడా కట్టిస్తూంది. 'పెళ్ళే వద్దన్న కొడుకు కోరి చేసుకొన్న పిల్ల లేకపోతే అతడేమైపోతాడు?' అని గడగడ లాడిపోయింది. అన్నహారాల్లో ప్రాయోపవసమే కాని కమలాకరం దేనికీ ఆటంకం పెట్టడం లేదు.

భాద్రపదం గడచి వానలు తగ్గుముఖం పట్టేయి. ఆశ్వయుజ మాసపు చలి మెల్లగా అడుగెట్టింది. కమలాకరం గుండెల్లో గుబులు ప్రవేశించింది.

"నాకేమీ అంతుపట్టడం లేదు. విశాఖపట్టణం తీసుకు వెళ్ళ"మని సలహా యిచ్చాడు డాక్టరు. అప్పటినుంచి అతడికి పూర్తిగా ధైర్యంపోయింది. ఒక ప్రక్కన కుముదిని "ఎక్కడికీ

అక్కరలేదు, ఆయువులేని వాళ్ళు ఎక్కడా బ్రతకరు." అంటూ మొండికేసింది. అతడికి ఎటూ తోచడంలేదు.

సాయంకాలం వదిన గదిలో లైటు వెయ్యడానికి వచ్చింది పద్మ. నైట్ జాగ్ వెళ్ళడానికి అన్నీ సిద్ధం చేసుకొనే ప్రయత్నంలో వున్నారు మిగిలిన అందరూ. తూర్పువైపు కిటికీ నుండి చలిగాలి వీస్తోంది. కిటికీమూసి వచ్చి వదిన ప్రక్కన కూర్చుంది పద్మ. అక్కడే కుర్చీలో కూర్చున్నాడు కమలాకరం ఏదో ఆలోచిస్తూ "వదినా, అసలు ఎలావుందో యేమిటో యేమీ చెప్పవేమిటి? నీ మనస్సులో ఏదో వుంది. నాకైనా చెప్పవా?" పద్మ కన్నీళ్ళాపుకొంటూ అడిగింది.

"ఏమీలేదు" అంది కుముదిని ప్రశాంత వదనంతో.

"నువ్వు తిరుపతి వెళ్ళినప్పుడు మ్రొక్కుబడి చెల్లింపులో యేదో లోపం జరిగిందని నా అనుమానం." అంది తిరిగి పద్మ.

కుముదిని మాటాడలేదు. పద్మ కొంచంసేపు కూర్చుని వెళ్ళిపోయింది.

కమలాకరం లేచివచ్చి కుముదిని మంచంపై కూర్చున్నాడు. ఆమె చేతిని చేతిలోకి తీసుకొంటూ "నువ్వు దగ్గర దగ్గరగా తిరిగి, అభిమానంగా చూచినప్పుడు మూర్ఖత్వంతో నీ ప్రేమను అందుకోలేక పోయాను. ఇప్పుడు నేను దగ్గరైన కొలదీ నీ హృదయం కవాటాలు మూసుకుపోతున్నాయి. ఏమిటీ శిక్ష కుముదినీ?" డగ్గుత్తికతో అడిగాడు.

"అటువంటిదేమీ లేదు. విచారించకండి. ఎక్కడ యే

లోకంలో వున్నా మీపైన నాకెప్పుడూ పరిపూర్ణ ప్రేమాభిమానాలుంటాయి."

పసిబిడ్డలా బావురుమన్నాడు కమలాకరం. "వద్దు కుముదినీ, అటువంటి మాటలు వద్దు. నీతోనే నాకు లోకం. నువ్వు లేనిది నాకు బ్రతుకు లేదు." కుముదునికికూడా దుఃఖమాగ లేదు. "విచారించకండి, వైద్యం చేయిస్తున్నారు. ఫలితాన్ని కెవరేం చేయగలరు?" అంది.

"అంతేనా? అంతేనా కుముదినీ? ఎవరూ ఏం చెయ్య లేరూ?" పసిబిడ్డ అమాయకంగా వేసినట్లుందా ప్రశ్న.

జాలిగా నవ్వి వూరుకుంది కుముదిని.

ఆ రాత్రి ఎవరు బ్రతిమాలినా కమలాకరం భోజనం చేయలేదు. కుముదిని దగ్గరే వుండిపోయాడు. కడకు ఆమె బలవంతంపై కొద్దిగా పాలు త్రాగాడు. "అలా ఎంత సేపు జాగారం చేస్తారు? వెళ్లి పడుకోండి." అంది కుముదిని రాత్రి పదిగంటలకు. కమలాకరం మాటాడలేదు. ఓ అరగంట పోయాక మళ్ళీ హెచ్చరించింది.

"వైద్యం చేయించడం, సేవ చేయడం మినహా నేమీ చేయలేనా? కళ్ళప్పగించి చూడడమేకాని నిన్ను బ్రతికించుకోలేనా?" అని ఆలోచిస్తున్నాను కుముదా.

ఇద్దరికీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

తెల్లవారితే వైజాగ్ ప్రయాణం. కాని తిరిగి తీసుకు రాగలనా? తగ్గుతుందా. యేమైపోతుంది కుముదిని? ఎక్కడికెళ్తుంది? యేమొచ్చింది కుముదినికి? ఎందుకిలాగై పోయింది?

ఎక్కడికి పోతుంది? ఏమిటి చావంటే? మొన్న రైలు ప్రయాణంలో చాలామంది చచ్చిపోయారు. అంటే! ఎక్కడికెళ్ళారు? ఇక కనపడరూ మనికి? ఎందుచేత?ఎందుకింత భయం చావంటే ఏమిటి చావుకి అర్థం? తిరిగి మొగటికే వచ్చాడు. ఏదో బాధ గుండెల్ని పిప్పి నుసి చేస్తోంది. ఎక్కడా మనస్సుకు కుదురు లేదు.

"కుముదినికి ఎలాగైనా ఈ జ్వరం తగ్గిపోతే బాగుండును. మరెప్పుడూ ఆమెను తేలికచేయను. ఎలాగైనా తగ్గితే బాగుండును! అలా అనుకొంటూంటే అతడికి తాను ఢిల్లీ వెళ్ళేముందు దీనవదనంతో ప్రయాణం మానుకొమ్మని ప్రాధేయపడిన కుముదిని మూర్తి మనస్సులో మెదిలింది. ఆవేళ ఆమెను తేలికగా తీసిపారవేశాడు-చీదరించుకొన్నాడు. తన సౌభాగ్య జీవితానికంతకూ ఆధారభూతమైన భర్తక్షేమం కొరకై కొట్టుమిట్టాడిపోయి అవ్యక్త ఆవేదనతో అల్లాడిపోతున్న ఆమె స్త్రీ హృదయాన్ని గుర్తించలేక పోయాడు. ఒక్క సానునయవాక్యమైనా పలుకలేదు. చేసేదిలేక కన్నీళ్ళతో సాగనంపింది. "అప్పుడామె ఏంచేసి వుంటుంది? నాలాగే బాధపడి వుంటుంది" అని తలపోస్తూ ప్రక్కకు చూచాడు. నీరసంగావున్న కుముదిని పాలిపోయిన ముఖం, మూసివున్న కనురెప్పలు, చిక్కిపోయిన శరీరమూ అతడిని కలచి వేశాయి.

"కుముదా!" ఆమె చెక్కిళ్ళు నిమురుతూ ఒక్కసారి

ఘొళ్ళుమన్నాడు-కలత నిద్రలోవున్న కుముదిని ఖంగారుగా మేల్కొని "ఏమిటి"ని ఆత్రంగా అడిగింది.

"నేను ఢిల్లీ వెళ్ళేముందు నువ్వు యిలాగే ఆరాట పడ్డావుకదూ నా కోసం? చెప్పు కుముదినీ చెప్పు. ఏం చేశావు? నన్ను బ్రతికించుకోవటానికేం చేశావు?"

అవి కన్నీళ్ళుకాదు-జలపాతాలు! కుముదినిని తడిపేస్తున్నాయి.

"మిమ్మల్నెంత క్షోభపెడ్తున్నాను నేను!" అంది నీరసంగా పైట చెంగుతో అతడి చెంపలు ఒత్తుతూ-

"క్షోభకాదు కుముదా; అప్రయోజకత్వం. నేనేమీ చేతగాని వాడిని. నువ్వు నీ ప్రాణం అడ్డువేసి నన్ను బ్రతికించుకొన్నావు."

"మాటాడవేం? అందుకేగా నేను బ్రతికి వచ్చాను?"

"అవును" నిశ్చలంగా, గంభీరంగా అంది కుముదిని.

"నిజమా!" ఆశ్చర్యంగా అరిచాడు కమలాకరం.

"నిజమే! మీరు క్షేమంగావస్తే తిరుపతి శ్రీనివాసుడికి కళ్యాణం చేయిస్తానని మొక్కుకున్నాను ముందు. కాని మళ్ళీ మీరూ మీ కోపమూ గుర్తువచ్చి అది అసాధ్యమని తేల్చుకొన్నాను. ఇంకేదారీ కన్పించలేదు." మాటాడ్తూంటే వస్తున్న ఆయాసానికి కాస్సేపూరుకొని తిరిగి మొదలెట్టింది. "మీరు లేని నేను అనవసరం. నేను లేకున్నా మీకు లోటు లేదు. అందుకే మిమ్మల్ని క్షేమంగా వుంచి నన్ను తీసుకు

పొమ్మని ఆ యేడుకొండలవాడిని వేడుకొన్నాను. దయతో ఆలించాడు నా మొర."

"కుముదా!" నిలువునా గజగజ లాడిపోయాడు. కలవరపాటుతో వూగిపోయాడు. "నిజమా దేవుడున్నాడా? దేవుడు నీ మొర విన్నాడా? అయితే యిప్పుడు నిన్ను తీసుకుపోతాడా?"

"ఏమో; నేననుకొంటున్నాను" నీరసంగా గోడవైపుకు ఒత్తిగిల్లింది.

అల్లకల్లోలిత హృదయంతో మెల్లగా లేచి కిటికీవద్ద నిల్చున్నాడు కమలాకరం. వెలుపల భయంకరమైన చీకటి అతడి హృదయావేదననూ, ఆత్మగ్లానినీ మరింత అధికం గావించి భయపెడుతున్నది. అకారణంగా శరీరం జలదరించింది.

"ఉన్నాడేమో దేవుడు! లేకుంటే కుముదిని కోరిక నెవరు తీర్చుతారు? చనిపోవలసిన తాను ఎలా బ్రతికాడు? పడిపోవలసిన పెట్టెలో ఎక్కిన వాడిని ఏ కారణం అలా తరిమేసింది? ఆ రోజు తిరుపతి కొండపై కారు గుద్దేసినపుడు తనకు మాత్రమే దెబ్బతగలడమేం? కారూ, డ్రైవరూ, కుముదినీ అలా చెక్కుచెదరక వుండడమేం? భగవత్సాన్నిధ్యానికొచ్చే కోట్లాది యాత్రీకులంతా మూర్ఖులేనా? కాదు. ఎంతమాత్రం కాదు. నేనే మూర్ఖుడిని. ఎలాగైనా కుముదిని జబ్బు తగ్గాలనుకొన్నాను. ఎలాగైనా అంటే నాకూ, డాక్టర్లకూ ఎవ్వరకూ లొంగని జబ్బు మమ్మల్ని మించిన యే అతీతశక్తి ప్రభావం వల్లనో తగ్గాలనేకదా! ఆ అదృశ్య శక్తి దేవుడా!

అవును దేవుడు వున్నాడు. వున్నాడు ఆ దేవుడే నా కోరిక తీరుస్తాడు. నాకు కుముదినిని బ్రతికిస్తాడు!"

భారం భగవంతునిపై వెయ్యగానే హృదయ భారం దిగిపోయినట్లయింది కమలాకరానికి. ఒక అనిర్వచనీయమైన ప్రశాంతత ఆవరించింది మనస్సును. "కుముదినికి తగ్గి బలం చేకూరగానే నీ కొండకు వస్తాము. నా తల నీలాలు సమర్పించుకొంటాను. కరుణించు తండ్రీ. వెంకటరమణమూర్తీ. ఇంత వరకు మూర్ఖంగా నేమేమో వాగేవాడిని. అపరాధాలు మన్నించు. నీ ప్రభావం ప్రదర్శించి నాలోని నాస్తికత్వాన్ని పారద్రోలు. నా అపరాధాలు మర్చిపో. అని ప్రార్థిస్తూ కుముదిని దెస చూచాడు. నీరసంగా నిద్ర పోతోంది. ఆమెకు నిద్రాభంగం చేయకుండా వెళ్ళి నేలపై కూర్చుని తల నిమర సాగాడు. తగ్గిపోతుంది కుముదిని తగ్గిపోతుంది. మనం హాయిగా వుందాం" అనుకొంటూంటే అతడికి తెలియకుండానే నిద్ర ఆవరించేసింది, ఆ నేలపైనే కూర్చుని మంచంపై తలాన్చి గాఢ నిద్రపోయ్యాడు.

మర్నాడుదయమే గదిలోనికి వచ్చిన సావిత్రి కొడుకు వాలకం చూచి దిగులుపడి పోయింది. సుఖశాంతులు లేక నలిగిపోతున్న కొడుకును చూచి ఆమె మనస్సు కరిగిపోయింది కుముదిని దెస చూచింది.

అప్పుడే మేల్కొన్న కుముదిని "అత్తయ్యా" అని పిలిచింది.

"ఏమమ్మా! ఎలా వుంది?"

"రోజులాగా బాధలేం లేవు. చాలా తేలికగావుంది. విశాఖ పట్టణం వెళ్ళక్కర లేదేమో!"

"నిజమేనా? నిజమే? తగ్గిందం టేతల్లీ!" సంభ్రమాశ్చర్యాలతో కోడలి దగ్గరగా వెళ్ళింది సావిత్రి.

సందడివిని కమలాకరం లేచాడు. లేస్తూనే కుముదిని పైకి తిరిగాయి అతడి చూపులు. నీరసంగానేవున్నా, ప్రశాంతంగా తేలికగా కన్పించిం దతడి కామె ముఖం.

"తగ్గిందా కుముదా?" అన్నాడు నేత్రాలు ఆశ్చర్య మొలికించుతూండగా ఆమె నుదుటిపై చేయివేసి. రోజూ మాదిరిగా శరీరం వేడితో కాలిపోవటం లేదు. సాధారణంగా వుంది.

"తగ్గింది. చాలా తేలికగా వుంది. కాని చాలానీరసంగా వుంది." అంది కుముదిని.

"అమ్మా!" అమాంతం తల్లి కాళ్ళు చుట్టేశాడు కమలాకరం. "దేవుడు నన్ను దయ తలిచాడమ్మా. ఆ శ్రీనివాసుడు నా జీవితం నిలబెట్టేడమ్మా"

"బాబూ!" ఆశ్చర్యపోయింది సావిత్రి. కుముదిని నోటి నుండి అసలు మాటేరాలేదు; ఆమె ఆశ్చర్యం అవధులు దాటి పోయింది.

"దైవ మహిమను యింతకాలం తెల్సుకోలేకపోయాను. మూర్ఖుడిలా ప్రవర్తించి నిన్నెంతో నొప్పించాను. క్షమించు కుముదా. నీకు నయం కాగానే తిరుపతి వెళ్దాం." అన్నాడు ఎముకల పోగులాగున్న కుముదిని తలనిమురుతూ.

"ఆ శ్రీనివాసుడే మనల్ని క్షమించాడు." అంది కుముదిని ఆనంద భాష్పాలొలికిస్తూ.

కోడలి జబ్బు తిరుగుముఖం పట్టడం, మూర్ఖ నాస్తిక వాదియైన కొడుకు పరిపూర్ణ భక్తుడుగా మారిపోవడంతో యింట్లో అందరికీ పండుగలాగ వుంది. కుటుంబమంతా నూతనానందోత్సాహాలతో ములిగి తేలారు.

7

హేమంతపు మంచు తెరల వస్త్రాలలో వింతసోయగాన్నొలకబోస్తున్నాయి తిరుపతి కొండలు. స్పెషల్ టికెట్టు కొని వుదయం నాలుగు గంటలకే సుప్రభాతం వేళకు హాజరయ్యారు వెంకటాచలం కుటుంబమంతా. శ్రీనివాసాలయంలో. పూర్ణాలంకృతుడై అభయహస్తమిస్తూ నిల్చున్న ఆ కళ్యాణ మూర్తిని దర్శించగానే మనస్సులలోని మాలిన్యాలన్నీ కడుక్కుపోయినట్లు ముగ్ధ ప్రశాంతత ఆవరించింది.

స్వామికి జరిగే సేవలన్నీ నేత్రానందకరంగా భక్తి ప్రపూరిత హృదయాలతో తిలకించి ప్రసాదం అందుకుని బసకు తిరిగి చేరుకున్నారు. "నీ కోరిక నెరవేరింది కుముదా! జంటగా దర్శనం చేసుకుంటామన్న నీ మొక్కు నాలుగు నెలలైనా తిరగకుండానే తీర్చేశావు" అన్నాడు మందహాసముతో కమలాకరం.

ఆ మాటలు విన్న సావిత్రి ఏలాగయితేనేం నీకిప్పటికి దేముడు కన్పించాడు! అంది కొడుకును...

"నిజమేనమ్మా, ఆ రాతి విగ్రహాలలో ఏముంటుం దనుకొన్నాను కాని యింత మహిమ వుందని నేనాడు అనుకోలేదు. ఎలా మ్రొక్కుకొన్నానో, నాలో మార్పు యెలా వచ్చిందో నాకే ఆశ్చర్యంగా వుంది." అన్నాడు నున్నని గుండు సవరించుకొంటూ కమలాకరం. అందరూ నవ్వేశారు.

వెంకటచలం అన్నాడు. "తెలిసీ తెలియని మిడిమిడి జ్ఞానాలతో మిడిసిపడే వాళ్ళందరికీ అనుభవమే గుణపాఠం. నిత్యం ఎన్నో ఆశలతో, కోర్కెలతో సతమతమౌతూ వుంటాం కాని అవి తీరుతాయో లేదో తెలియదు. ఏదో అతీత శక్తి మానవ యత్నాన్ని మించిన అతీతశక్తి ఆ కోర్కెను తీర్చితే బాగుండునని ఆశ పడ్తాము. నీ మనస్సులోని ఆ ఆశకిరణోజ్జ్వలమైన అతీత శక్తే భగవత్స్వరూపం!"

"ఎంత నేర్చినా ఎంత చూచినా, ఎంత సాధించినా మానవ మాత్రులం. ఆ చిద్విలాసుని పరిధిని దాటలేం. దేవుడు లేడంటూ అంతా నా గొప్పేనని అహంభావంతో విర్రవీగావు. కాని ఆ రోజుల్లో నీకు నిజమైన స్వచ్ఛమయిన శాంతి లేనేలేదు. మన కోరిక తీరనంత మాత్రాన ఆ విధాతను దూయబట్టడం అవివేకం. మనస్సులోని కోరిక ఫలితం ఏదయినప్పటికీ భగవంతునిపై వేసి మనం నిశ్చింతగా తప్పుకోవటంలోనే ఆత్మశాంతీ తృప్తీ వున్నాయి. ఈ అస్థిత్వ శబ్దమే మానవునికి జయకరమయినది.

ఈ సత్యాన్ని ఎప్పుడో ఒకప్పుడు ప్రతివ్యక్తి గుర్తించక పోడు. ఎప్పుడు మన జీవితానికేం కానుందో మనకే తెలియని

అల్పజీవులం. ఏ నిముషాన యీ జగన్నాటకం నుండి విర మిస్తామో తెలియదు. అయినా ఈ బుద్బుదప్రాయ జీవితం నిమిత్తం నిరంతరం కొట్లు మిట్లాడ్తూనే వుంటాం.

"విజ్ఞానార్థం విదేశీ విద్య నెంత అభ్యసించినా స్వజాతి సంస్కృతిని మరువక పోవడమే ఔన్నత్య చిహ్నం. విదేశ సాంప్రదాయ వ్యామోహంతో కృత్రిమ సంస్కృతి నలవర చుకో ప్రయత్నించినా దానికి వుండే ఆయువు తక్కువ. యుగయుగాలనుండీ, తరతరాలుగా, నరనరాల్లోను జీర్ణించుకు పోయిన నీ జాతి సంస్కృతినీ ఔన్నత్య భావాలనూ తుడిచి పారవేయడం అసాధ్యం. నిద్రాణమయి వున్న జన్మ జన్మాంతర సంస్కృతి ఎప్పుడో ఒకప్పుడు మేల్కొని జ్ఞానమార్గం చూపక మానదు."

అవనత శిరస్కుడై తండ్రి బోధనంతనూ నమ్రతతో, గౌరవంగా విని ఎదలో పదిల పర్చుకొన్నాడు కమలాకరం.

ఇప్పుడు ప్రతివుదయం మెలకువ వస్తూనే కమలాకరం చెవులను కుముదినీ దేవి మధుర కంఠస్వరంతో "కౌసల్య తనయ శ్రీరామ కొస్తుభాంగా......"అంటూ తన ఆరాధ్య దైవానికి చేసే సుప్రభాత సంకీర్తన తేనె సోనలు కురిపిం చుతూ చెవుల సోకుతుంది.

సుప్రభాతం. "నా జీవితానికే సుప్రభాతం!" భక్తి ప్రఫుల్ల మానసంతో శ్రీనివాసునికి అంజలి ఘటిస్తాడు.

* * *